# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :180 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: ఆదివారం 21-09-2025 | పేజీలు:4 వెల: 2.00


## ప్రతీ గుడిలో జమ్మి నాటాలన్నదే గ్రీన్ ఇండియా లక్ష్యం

కాల్వ శ్రీరాంపూర్, సెప్టెంబర్ 20 : గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో భాగంగా కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రలోని శ్రీ జగత్ మహా మునీశ్వర స్వామి ఆలయం, శ్రీ సీత రామచంద్ర స్వామి ఆలయంలో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కో ఆర్డినేటర్ సతీశ్, హరితసేన రాష్ట్ర కోఆర్డినేటర్ చెప్పాల రాజేశ్వరరావు, మాజీ ఎంపీపీ నూనెటి సంపత్, మాజీ జడ్పీటీసీ వంగల తిరుపతి రెడ్డితో కలిసి ఆలయాల జమ్మి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రీన్ ఇండియా లో భాగంగా మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో కోట్లాది మొక్కలు నాటి దేశానికే పచ్చదనం పెపొందించడం జరుగుతుందని అన్నారు. అలాగే గుడికో జమ్మి చెట్టులో భాగంగా అన్ని ప్రముఖ ఆలయాల్లో జమ్మి మొక్కలను నాటుతున్నామని తెలిపారు. అంతరించిపోతున్న చెట్లను కాపాడుకోవడంలో భాగంగా సంప్రదాయంలో బాగంగా జమ్మి మొక్కలను నాటడం ప్రారంభించామని, ప్రతీ గ్రామంలో ప్రతీ ఆలయంలో జమ్మి చెట్లు నాటుతున్నామని వెల్లడించారు.

## ఎవరైనా పార్టీ పెట్టుకోవచ్చు.. ఎమ్మెల్సీ కవిత సంచలన వ్యాఖ్యలు..




హైదరాబాద్: ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు కవిత ఎప్పుడు మీడియా ముందుకు వచ్చినా అదో సంచలనంగా మారుతుంది. ఎప్పుడు, ఎవరి మీద ఏ ఆరోపణలు చేస్తుందో అన్న భయం నాయకులను కలవర పెడుతోంది. సొంత పార్టీ, ప్రతిపక్ష పార్టీ అని తేడా లేకుండా.. తన మాటలతో రెచ్చిపోతుంది. ఆమె మాటల్లో నిజా నిజాలు పక్కన పెడితే.. కవిత చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో దుమారం రేపుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా.. మరోసారి కవిత మీడియా ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా, ఎమ్మెల్యే హరీష్ రావు సోషల్ మీడియా, సంతోష్ రావు సీక్రెట్ మీడియా తన మీద దాడి చేస్తున్నాయని కవిత ఆరోపించారు. అందరూ తననే.. టార్గెట్ చేస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏమన్నారో తెలియదని, కానీ 42 శాతం బీసీ రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకోకుంటే.. ముఖ్యమంత్రి, మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని ఆమె హెచ్చరించారు.

ఎమ్మెల్సీ పదవికి స్పీకర్ ఫార్మాట్‌లోనే రాజీనామా చేసినట్లు చెప్పుకొచ్చారు. తన రాజీనామాను ఆమోదించాలని చైర్మన్‌ను కోరినట్లు పేర్కొన్నారు. రాజీనామాకు వారెందుకు ఆలస్యం చేస్తున్నారో తనకు తెలియదని తెలిపారు.బీఆర్ఎస్ ద్వారా వచ్చిన పదవి ఆనాడు వద్దనుకున్నాను.. ఇప్పుడు వద్దనుకుంటున్నానని కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజాస్వామ్యంలో ఎన్ని పార్టీలుంటే అంత మంచిదని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎవరైనా పార్టీ పెట్టుకోవచ్చని తేల్చి చెప్పారు. ఎంతమంది జైబీసీ అంటే..అంత మంచిదని పేర్కొన్నారు. బీసీల కోసం అందరం కలసి కొట్లాడుదామని పిలుపునిచ్చారు. ఇష్యూ మీద మాట్లాడితే సమాధానం ఇస్తాను.. వ్యక్తిగతంగా విమర్శలు సరికావని అన్నారు. సొంత ఊరు ఆహ్వానం ఎప్పుడూ ప్రత్యేకమే అని.. చింతమడకలో బతుకమ్మ వేడుకలకు వెళ్ళటం వెనుక రాజకీయం ఏమీ లేదని చెప్పారు. గతేడాది రాజకీయంగా క్లిష్టమైన పరిస్థితుల్లో ఉన్నాను. అందుకే బతుకమ్మ వేడుకల్లో పాల్గొనలేదని వివరించారు. ఒకటి కాదు.. రెండు బతుకమ్మ చీరలు ఇస్తామని సీఎం రేవంత్ అన్నారని గుర్తు చేశారు. బతుకమ్మ పేరుతో మహిళలకు చీరలు ఇవ్వాలి కానీ ఇందిరమ్మ పేరుతో మాత్రం ఇవ్వొద్దని కవిత డిమాండ్ చేశారు.

## భారత్ మాపైకి దాడికి వస్తే సౌదీ అండగా వస్తుంది

ఇస్లామాబాద్:దాయాది పాకిస్థాన్, సౌదీ అరేబియా మధ్య కీలక రక్షణ ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే. ఈ ఒప్పందంపై పాక్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం.. భారత్ తమపైకి దాడికి వస్తే సౌదీ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఓ మీడియా ఛానెల్‌తో మాట్లాడిన ఖ్వాజాకు 'భారత్‌తో ఉద్రిక్తతలు తలెత్తినప్పుడు పాక్‌కు సౌదీ అరేబియా దళాలు అండగా నిలుస్తాయా..?' అని విలేకరు ప్రశ్నించారు. దీనికి ఖ్వాజా స్పందిస్తూ.. 'కచ్చితంగా.. అందులో ఎలాంటి సందేహం లేదు' అని సమాధానమిచ్చారు. ఈ ఒప్పందం ప్రకారం.. ఇరు దేశాల్లో దేనిపైన అయినా శత్రు దేశం దురాక్రమణకు పాల్పడితే సంయుక్తంగా కలిసి పోరాడతాయని పేర్కొన్నారు. అయితే ఈ ఒప్పందం ఎలాంటి దురుద్దేశంతో చేసుకున్నది కాదని వ్యాఖ్యానించారు. అంతేకాదు పాక్ అణ్వాయుధాలను సౌదీ కూడా ఉపయోగించుకోవచ్చని ఖ్వాజా ఈ సందర్భంగా తెలిపారు.దాయాది పాకిస్థాన్, సౌదీ అరేబియా మధ్య కీలక రక్షణ ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే. రెండు రోజుల క్రితం సౌదీ అరేబియా పర్యటనకు వెళ్లిన పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఆ దేశ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వ్యూహాత్మక రక్షణ ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. రెండు



దేశాల్లో దేనిపైన అయినా దాడి జరిగితే అది ఇద్దరిపైనా జరిగిన దాడిగా భావిస్తారు. అప్పుడు రెండు దేశాలూ దాడి చేసిన దేశంపై పోరాడేలా ఈ ఒప్పందం కుదుర్చుకున్నారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాక్– భారత్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న వేళ ఈ ఒప్పందం జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇక ఈ పరస్పర రక్షణ ఒప్పందంలో ఇతర అరబ్ దేశాలు కూడా చేరే అవకాశం లేకపోలేదని పాక్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ తెలిపారు.

## ఉత్తరాఖండ్ కొండచరియల్లో తీవ్ర విషాదం



చమోలీ: ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో కొన్ని రోజుల క్రితం భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడ్డ విషయం తెలిసిందే. ఆ భారీ వరదల ధాటికి సమీప గ్రామాలు ధ్వంసం అయ్యాయి. కుంటారి లగాపాలి గ్రామంలో హృదయవిదారకర ఘటన చోటుచేసుకున్నది. శిథిలాల కింద తల్లి, ఆమె ఇద్దరు కవల పిల్లలను రెస్క్యూ దళాలు గుర్తించారు. 38 ఏళ్ల కాంతా దేవితో పాటు ఆమెకు చెందిన పదేళ్ల కవల పిల్లలు కూడా ప్రాణాలు విడిచారు. ఇద్దరు పిల్లలను చెరొకర్ని ఓ చేతిలో పట్టుకుని ఆ తల్లి తుది శ్వాస విడిచింది. చివరి నిమిషం వరకు తన పిల్లలను కాపాడుకునేందుకు ఆ తల్లి తీవ్రంగా ప్రయత్నించింది.ఆ తల్లీ, పిల్లల శవాలను చూసిన స్థానికులు కన్నీరుమున్నీయ్యారు. ఇంటికి చెందిన భారీ గోడలు కూలడంతో.. ఆ తల్లీపిల్లలు మరణించారు. శుక్రవారం నాటికి అయిదుగురు మృతదేహాలను వెలికితీశారు. కాంతా దేవి భర్త కున్వర్ సింగ్ కొండచరిల్లో చిక్కుకున్నా.. అతను అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డాడు. 16 గంటల తర్వాత ఆ ఇంటిని ఎన్డీఆర్ఎఫ్ దళాలు అన్వేషించాయి. కాంతా దేవి భర్త ప్రాణాలతోనే ఉన్నా.. అతనికి ఇప్పుడు కుటుంబం, ఇల్లు లేదు.

## మహిళలను బీఆర్ఎస్ ఇన్సల్ట్ చేస్తోంది.. మంత్రి సీతక్క ఫైర్

హైదరాబాద్, సెప్టెంబర్ 20: పేదల సంక్షేమానికి, మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేసిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఆధ్వర్యంలోనే పొదుపు సంఘాలు ఏర్పాటయ్యాయని గుర్తుచేశారు. రుణాలు తీసుకుని లక్షల మంది లబ్ది పొందుతున్నారని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, పెట్రోల్ బంక్‌లు, సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకుంటున్నారన్నారు. వడ్డీ లేని రుణాలు మహిళలకు ఇప్పించి, వడ్డీ ప్రభుత్వం కడుతోందని మంత్రి వెల్లడించారు. 95 శాతం మహిళలు సక్రమంగా తీసుకున్న ఋణాలు చెల్లిస్తున్నారని తెలిపారు. ఉచిత బస్సుపై బీఆర్ఎస్ వాళ్ళు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఆడవాళ్ళు ఒక్క దగ్గర ఉండరని, కొట్టుకుంటారు అని మహిళలను ఇన్సల్ట్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సులకు మహిళలను ఓనర్లుగా మార్చామని అన్నారు. పెట్రోల్ బంక్‌లు నిర్వహిస్తూ మహిళలు తమ సత్తా చాటుతున్నారని కొనియాడారు. నగరంలో 35 చోట్ల ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు నడిపిస్తున్నారన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేసే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డిముందుకెళ్తున్నారని చెప్పుకొచ్చారు. ప్రభుత్వం ఇచ్చే పథకాలపై బీఆర్ఎస్ నాయకులు చేసే దుష్ప్రచారం నమ్మొద్దన్నారు.వైఎస్ ప్రభుత్వంలో మహిళలు కూడబెట్టిన డబ్బులను, కేసీఆర్ ప్రభుత్వం తినేసిందని ఆరోపించారు. ప్రస్తుతం కొన్ని మహిళా సంఘాలు డిఫాల్టర్లుగా మారడానికి గత ప్రభుత్వమే కారణమని మండిపడ్డారు. గతంలో వాళ్ళు ఇచ్చిన బతుకమ్మ చీరలు వాళ్ల బిడ్డలు, భార్యలు, బంధువులు కట్టుకోలేదన్నారు. బతుకమ్మ పండగకు కూడా



కాంగ్రెస్‌పైన విష ప్రచారం చేసి పాట విడుదల చేశారని ఫైర్ అయ్యారు. పండగను ఉపయోగించుకుని రాజకీయ దుష్ప్రచారం చేస్తున్నారంటూ మంత్రి సీతక్క తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

### వికలాంగుల పింఛన్ పెంచాలని గ్రామపంచాయతీ ముట్టడి

హుజురాబాద్, సెప్టెంబర్ 20 : హుజురాబాద్ మండలంలోని పోతిరెడ్డి పేటలో వికలాంగుల పింఛన్ పెంచాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ ముట్టడించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవు నూరి రవీందర్, తెలంగాణ బీసీ సిటిజన్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్ మాట్లాడుతూ వికలాంగులు వితంతువులు వృద్ధులు కోసం ఎమ్మార్పీఎస్ రాష్ట్రవ్యాప్తంగా ముట్టడి కార్యక్రమాన్ని తీసుకోవడం

## వాహన కొనుగోలుదారులపై భారం మోపడం సీఎం ప్రజా వ్యతిరేక వైఖరికి నిదర్శనం

హైదరాబాద్ : పెరిగిపోతున్న ప్రమాదాల నివారణకు రహదారి భద్రతా చర్యలు తీసుకోవాలని గౌరవ సుప్రీంకోర్టు ఆదేశాలిస్తే వాటిని అమలుచేయాల్సింది పోయి, వాహన కొనుగోలుదారులపై భారం మోపడం ముఖ్యమంత్రి ప్రజావ్యతిరేక వైఖరికి నిదర్శనం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. రాష్ట్ర బడ్జెట్ నుంచి రోడ్ సేఫ్టీకి నిధులు కేటాయించి భద్రతా ప్రమాణాలను పెంచకుండా ఇలా అమాయక ప్రజలపై భారం మోపడం అత్యంత దారుణం అని కేటీఆర్ మండిపడ్డారు.

హైడ్రా వంటి దిక్కుమాలిన విధానాలతో ప్రభుత్వ ఆదాయాలకు గండికొట్టి, ఇప్పుడు ఆ లోటును పూడ్చలేక సామాన్య ప్రజలపై విరుచుకుపడటం దుర్మార్గమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రహదారి భద్రతా సెస్ పేరిట ఒక్కో కొత్త వాహనం కొనుగోలుపై ఏకంగా రెండు నుంచి పదివేల వరకూ అదనపు భారం వేయడం పేద, మధ్యతరగతికి చెందిన ప్రజానీకాన్ని దగా చేయడమే అని నిప్పులు చెరిగారు. రెండేళ్లు కావస్తున్నా ఇవ్వాల్సిన గ్యారెంటీలను గాలికొదిలేసి, చివరికి ప్రజల నుంచే ముక్కుపిండి రూ. 270 కోట్లు వసూలు



చేసే కుట్రచేస్తే కాంగ్రెస్ సర్కారును ప్రజలు క్షమించరు. పైసా పైసా కూడబెట్టుకుని, అప్పు చేసి మరీ వాహనం కొనుగోలు చేసే వారి జేబులు కొట్టే ఇలాంటి పన్నాగాలకు కాంగ్రెస్ సర్కారు ఇకనైనా స్వస్తి పలకాలి అని కేటీఆర్ పేర్కొన్నారు.

## చంద్రబాబు మళ్లీ అదే తప్పు చేస్తున్నారా?



అమరావతి,కొద్ది రోజులుగా రాజకీయ చర్చగా మారిన వైసీపీ ఎమ్మెల్సీలు అధికార టీడీపీ తీర్థం పుచ్చుకుంటారన్న ప్రచారానికి తగ్గట్లే శుక్రవారం ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకున్నాయి. ముగ్గురు వైసీపీ ఎమ్మెల్సీలు టీడీపీలో చేరారు. దీంతో వైసీపీ పెద్ద దెబ్బ తగిలినట్లుగా చెప్పాలి. వైసీపీకి చెందిన ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్.. కర్రి పద్మశ్రీ.. బల్లి కళ్యాణ్ చక్రవర్తి ఉన్నారు. ఇప్పటికే వీరు పార్టీ పదవికి.. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. అయితే.. వీరి రాజీనామాను వైసీపీ నేపథ్యం ఉన్న మండలి ఛైర్మన్ కొయ్యే మోషే రాజు ఆమోదించ లేదు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న వేళ.. మండలి సభ్యులు ముగ్గురు టీడీపీలోకి చేరటం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. వీరి సేవల్ని తగిన రీతిలో ఉపయోగించుకుంటామన్న సీఎం చంద్రబాబు హామీతో ఈ ముగ్గురు సైకిల్ ఎక్కినట్లుగా చెబుతునవారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో వీరిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించిన చంద్రబాబు.. వీరికి స్వయంగా పార్టీ కండువాలు కప్పారు. తాము ఆర్నెల్లుగా తమ పదవులకు రాజీనామా చేసి.. మండలి ఛైర్మన్ నిర్ణయం కోసం ఎదురుచూశామని.. అయినప్పటికీ ఆయన నుంచి ఎలాంటి నిర్ణయం రాని నేపథ్యంలో తాము పార్టీ మారేందుకు సిద్ధమైనట్లు పేర్కొన్నారు. పార్టీ మారిన ముగ్గురు ఎమ్మెల్సీల్లో ఒకరైన మర్రి రాజశేఖర్ స్పందిస్తూ.. సోమవారం నుంచి తాము మండలి సమావేశాలకు హాజరవుతామని స్పష్టం చేశారు. ఏం చేస్తారో అది చేసుకోవాలన్న వారు.. మండలి ఛైర్మన్ కు తామిచ్చిన రాజీనామాలపై తగిన నిర్ణయం తీసుకోవాలని చెప్పినా.. ఆయన ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. ఇదే కాదు.. గతంలోనూ వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరిన ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ రాజీనామాను సైతం మండలి ఛైర్మన్ ఇప్పటివరకు స్పందించలేదు. పలు వినతుల్ని మండలి ఛైర్మన్ కు అందించినా.. ఎలాంటి స్పందన లేకపోవటంతో ఆయన హైకోర్టును ఆశ్రయించటం.. ప్రస్తుతం ఈ వివాదం అక్కడ విచారణలో ఉండటం తెలిసిందే. దీంతో.. హైకోర్టు నిర్ణయం ఎలా ఉంటుందన్న దానిపై ఉత్కంట వ్యక్తమవుతోంది. ఇదిలా ఉండగా.. ఎప్పుడూ చేసే తప్పే.. టీడీపీ అధినేత చంద్రబాబు చేసినట్లుగా కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. గతంలోనూ అధికారంలో ఉన్నప్పుడు.. ఎమ్మెల్సీ.. ఎమ్మెల్యేలను పెద్ద ఎత్తున పార్టీలోకి చేర్చుకోవటం.. ఆ తర్వాతి ఎన్నికల్లో ఓటమి పాలైన తర్వాత కొందరు వైసీపీకి వెనక్కి వెళ్లటం తెలిసిందే. ఈ సందర్భంగా చంద్రబాబు తన తీరు మార్చుకోవాలన్న మాట వినిపించింది. దీనికి తగ్గట్లే తర్వాతి సందర్భాల్లో పార్టీమారిన వారిని.. తాము ఆహ్వానించటమని పేర్కొన్నప్పటికి తాజాగా మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరించిన చంద్రబాబు తీరుపై స్పందిస్తూ.. ఆయనకు రాజకీయప్రయోజనాలే తప్పించి. ఇంకేమీ అక్కర్లేదంటూ కొందరు పేర్కొనటం కనిపిస్తోంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ముగ్గురు వైసీపీ ఎమ్మెల్యేలు పార్టీ మారినంతనే అనూహ్య మార్పులు జరిగిపోవటం.. పార్టీ బలం ఒక్కసారిగా మారిపోయి.. పరిస్థితులు అధికార పక్షం కంట్రోల్ లోకి వెళ్లిపోతాయా? అంటే.. లేదనే చెప్పాలి. అలాంటప్పుడు ఈ తరహా నిర్ణయాన్ని చంద్రబాబు ఎందుకు తీసుకోవాలి? అన్నది ప్రశ్నగా మారింది. ఏపీ శాసన మండలిలో ఉన్న పార్టీ సభ్యుల బలాల్ని చూస్తే.. మొత్తం మండలిల 56 మంది సభ్యులు ఉండాల్సి ఉంటుంది. ఇందులో వైసీపీకి 34 మంది ఉండగా.. తెలుగుదేశం పార్టీకి 10 మంది ఉన్నారు. జనసేనకు ఇద్దరు.. బీజేపీకి ఒకరు..స్వతంత్రులు ఐదుగురితో పాటు.. ఆరు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. తాజాగా ముగ్గురు వైసీపీ ఎమ్మెల్సీలు పార్టీ మారి టీడీపీ కండువాను కప్పుకున్న పరిస్థితుల్లో ఎన్నిక అనివార్యం అవుతుందని చెప్పాలి. అదే జరిగినప్పుడు ఎమ్మెల్యేల బలం తిరుగులేనిదిగా ఉన్న కూటమికి చెందిన అభ్యర్థులే పదవుల్ని సొంతం చేసుకుంటారు. అంటే.. టీడీపీలో చేర్చినా.. చేర్చకున్నా.. వైసీపీ ఎమ్మెల్సీలకు కలిగే ప్రయోజనం తక్కువే ఉంటుంది. అలాంటప్పుడు ప్రత్యర్థి పార్టీలకు సంబంధించిన వారిని చేర్చుకోవాల్సిన అవసరం లేదు. అయినప్పటికీ.. వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధుల్ని చేర్చుకోవటం ద్వారా చంద్రబాబు తప్పు చేస్తున్నారనే చెప్పాలి. ఎందుకంటే.. ఇప్పటివరకు ఆయన అనుసరించిన రాజకీయ వ్యూహాలపై పెద్ద ఎత్తున విమర్శలు ఉన్నాయి. అందుకు తగ్గట్లే తాజాగా వైసీపీ ఎమ్మెల్సీలకు టీడీపీ గూట్లో చోటు కల్పించకుంటే బాగుండేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## తెలంగాణలో స్థానిక ఎన్నికలు కష్టమే.. చేతెలెత్తేసిన రేవంత్ సర్కార్!

హైదరాబాద్, తెలంగాణలో స్థానిక సంస్థల పదవీకాలం ముగిసి రెండేళ్లు కావస్తోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి కూడా రెండేళ్లు కావస్తోంది. కానీ, స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడంలో రేవంత్ సర్కార్ జాప్యం చేస్తోంది. ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికలు జరుపాలని దాఖలైన పిటిషన్లను విచారణ చేసి హైకోర్టు.. సెప్టెంబర్ 30 లోగా ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించింది. అయితే మొదట హడావుడి చేసిన రాష్ట్ర ప్రభుత్వం చివరకు ఇప్పుడు నిర్వహించలేమని చేతులు ఎత్తేసింది. ఇందుకు రిజర్వేషన్ల పెంపును సాగుకుడా చూపుతోంది. ఢిల్లీలో శుక్రవారం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికలపై స్పష్టమైన వైఖరి వ్యక్తం చేశారు. ఈ నెల 30 లోపు ఎన్నికల నిర్వహణ అసాధ్యమని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లకు సంబంధించిన బిల్లులపై రాష్ట్రపతి, గవర్నర్ ఆమోదాలు ఆలస్యమవుతున్నందున తీర్పు వచ్చే వరకు ఎదురుచూడాలని పేర్కొన్నారు. '

### బీసీ రిజర్వేషన్ బిల్లు..

స్థానిక ఎన్నికలు ఆలస్యమవడానికి ప్రధాన కారణం బీసీలకు 42 శాతం కేటాయింపు బిల్లు. అసెంబ్లీలో ఆమోదించబడిన ఈ చట్టానికి గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ ఇంకా సంతకం చేయలేదు. కేంద్రం కూడా అడ్డుకుంటోందని ఆరోపణలు ఉన్నాయి. హైకోర్టు ఆదేశాల ప్రకారం ఈ నెల 30లోపు ఎన్నికలు జరపాలని ఉన్నప్పటికీ, 50 శాతం మించే రిజర్వేషన్‌లు చట్టవిరుద్ధమనే సుప్రీంకోర్టు నిబంధనలు ప్రభుత్వాన్ని పునరాలోచనలో పడేశాయి. ప్రభుత్వం ఇప్పుడు ఈ అంశంపై విస్తృత సమీక్షలు చేస్తోంది. రిజర్వేషన్ ఖరారు లేకుండా ఎన్నికలు నిర్వహించడం రాజకీయంగా ప్రమాదకరమని పార్టీ నాయకులు భావిస్తున్నారు. ఈ కారణంగానే గ్రామ పంచాయతీలు, జెండీపీసీలు వంటి స్థానిక సంస్థల ఎన్నికలను జాప్యం చేస్తోంది.

### నేతల్లో నిరాశ.. ఆశావహుల్లో ఆందోళన

సీఎం ప్రకటనతో కాంగ్రెస్ పార్టీలోని స్థానిక నాయకులు, ఎన్నికల అభ్యర్థులు



తీవ్ర నిరాశకు గురయ్యారు. ఎన్నికలు ఆలస్యమైతే పార్టీల మధ్య పోటీలు ప్రభావితమవుతాయని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే పింఛన్ల పెంపు లేకపోవడంతో గ్రామీణులు అసంతృప్తితో ఉన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కూడా జాప్యం జరుగుతోంది. యూరియా కొరత రైతులను ఇబ్బంది పెడుతోంది. ఎన్నికల ఆలస్యంతో అధికార పార్టీకే నష్టమన్న అభిప్రాయం ఉంది. ఆర్థిక భారం, చిన్న పార్టీల పోటీలు పెరగడం వల్ల కాంగ్రెస్ బలహీనపడవచ్చనే ఆందోళన కూడా వ్యక్తమవుతోంది. పంచాయతీ ఎన్నికల ఆలస్యం కాంగ్రెస్ ప్రభుత్వానికి రాజకీయంగా రెండు ఇబ్బందులు ఉన్నాయి. ఒకవైపు రిజర్వేషన్‌ల ద్వారా బీసీల మద్దతు సాధించాలనే లక్ష్యం, మరోవైపు హైకోర్టు ఆదేశాలు, కేంద్ర ఆటంకాలు ప్రభుత్వాన్ని బలహీన స్థితిలో ఉంచాయి. ఎన్నికలు ఆలస్యమైతే, గ్రామీణ ఓటర్లలో అసంతృప్తి పెరగవచ్చు. విపక్షాలు దీన్ని ప్రచారంగా మలిచుకోవచ్చు. బీజేపీ ఇప్పటికే కాంగ్రెస్‌ను 'ఎన్నికల భయం'తో ఆరోపిస్తోంది. భవిష్యత్తులో, సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా ఎన్నికలు జరిగితే, రిజర్వేషన్‌లు సమతుల్యంగా రూపొందించడం కీలకం. లేకపోతే, స్థానిక పాలనలో అంతరాయాలు పెరిగి, ప్రభుత్వ విశ్వసనీయతను దెబ్బతీస్తుంది.

## సంపాదకీయం

ఆదివారం 21-09-2025

# పెచ్చరిల్లిన మితవాదం

ప్రపంచ వ్యాప్తంగా మితవాద శక్తులు పెచ్చరిల్లడం ఆందోళనకరం. మన దేశంతో పాటు, అనేక దేశాలను వలసలుగా చేసుకుని రవి అస్తమించని సామ్రాజ్యంగా వినుతికెక్కిన బ్రిటన్.. వలసలకు వ్యతిరేకంగా ప్రదర్శనలు నిర్వహిస్తూ జాతీయ దురభిమానాన్ని ప్రపంచానికి ప్రదర్శిస్తోంది. అమెరికా అండదండలతో ఇజ్రాయిల్.. గాజాలో జాతి నిర్మూలన విధ్వంసకాండ సాగిస్తోంది. ప్రపంచానికి పెద్దన్నగా తనకుతాను కిరీటం తగిలించుకున్న అమెరికాలో ట్రంప్ 'అమెరికా ఫస్ట్' అన్న నినాదం ఇచ్చారు. గ్రేట్ అమెరికా అగైన్ అంటూ ఉద్దేశపూర్వకంగా అక్కడి ప్రజలను రెచ్చగొడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా మితవాదం ఇలా పెచ్చరిల్లడానికి నయా ఉదారవాద ఆర్థిక విధానపు దుష్ఫలితాలు కారణం. కార్పొరేట్ల ఖజానాలతో పాటు సొంత పొట్టలు నింపుకోవడం తప్ప పాలకులకు మరో ధ్యాస లేకపోవడంతో ప్రజల కనీస అవసరాలు తీరడం సైతం గగనంగా మారింది. దీంతో పెల్లుబుకుతున్న ప్రజల ఆగ్రహాన్ని, ముఖ్యంగా యువతలో అసంతృప్తిని పక్కదోవ పట్టించేందుకు పాలకులు ఒక వ్యూహం ప్రకారం మితవాదాన్ని, జాత్యహంకారాన్ని రెచ్చగొడుతున్నారు. దీనికి కార్పొరేట్ శక్తులు మద్దతిస్తున్నాయి. అమెరికా, బ్రిటన్‌లలో చోటుచేసుకుంటున్న పరిణామాలే దీనికి నిదర్శనం.అమెరికా ప్రోద్భలంతో ఇజ్రాయిల్ జరుపుతున్న జాత్యాహంకార యుద్ధంలో ఇప్పటి వరకు 63 వేల మందికిపైగా మరణించినట్లు అంచనా! గాజాను నేలమట్టం చేసి అక్కడ విలాసవంతమైన రిసార్టును నిర్మించాలన్న ట్రంప్ ఆలోచనకన్నా దుర్మార్గమేముంది! చౌకగా లభించే కార్మికులతో అత్యధిక లాభాలు ఆర్జించేందుకు మనదేశంతో పాటు, అన్ని మూడవ ప్రపంచ దేశాలపై ప్రపంచీకరణ విధానాలను రుద్దింది అమెరికాతో పాటు పాశ్చాత్య దేశాల్లోని పెట్టుబడిదారీ వర్గం, పాలకులు కలిసే కదా! ఈ ఉదారవాద విధానాలతో పాటే అనేక దేశాల్లో మితవాదం కూడా బలపడింది. ఆ విధానాల ఫలితంగా కొద్ది మంది ఆస్తులు కొండల్లా పెరుగుతుంటే, మరోవైపు మితవాదపు విద్వేషం ఆ దేశాల్లోని ప్రజల మెదళ్లలో నిండిపోతోంది. ఇక్కడి కార్మికుల నెత్తుటితో పండిన లాభాల పంటను తమ ఖజానాలను నింపుకున్నారేగానీ, తమ సొంత దేశాల్లోని సామాన్యుల కష్టాలు పట్టించుకున్నారా? పట్టించుకొని ఉంటే అగ్రరాజ్యంగా చెప్పుకుంటూనే ఇతర దేశాలతో పోల్చుకుని గుండెలు బాదుకునే పరిస్థితి దాపురించేదా? అసంతృప్తిని పక్కదోవ పట్టించడానికి జాతీయవాద ముసుగులు వేసుకుని దురభిమానాలను రెచ్చగొడుతున్నారు కదా! భూగోళంలో మూడవ వంతు భాగాన్ని తన వలసగా మార్చుకున్న బ్రిటన్ ఇప్పుడు వలసదారులను చూసి భోరుమనడం, దానికి ప్రపంచ బడా పెట్టుబడిదారుల్లో ఒకరైన ఎలన్‌మస్క్ మద్దతివ్వడం దేనికి సంకేతం? నిజానికి తక్కువ జీతాలకే వస్తున్నారంటూ వలసలను ప్రోత్సహించింది అక్కడి పాలకులు, పెట్టుబడిదారీ వర్గం కాదా! పెద్దయెత్తున వస్తున్న అనధికార వలసదారులను చూసీచూడనట్లు ఊరుకున్న చరిత్ర బ్రిటన్, అమెరికాలకు లేదా? అలా వస్తున్న వలసదారులను తమ దేశంలోని కార్మికులకు పోటీగా నిలిపి వారి వేతనాలను గణనీయంగా తగ్గించిన విషయం నిజం కాదా? అప్పుడు ఊరుకున్నా, ఇప్పుడు పెడబొబ్బలు పెట్టేలా యువతను రెచ్చగొడుతున్నా దానికి కారణం ఒక్కటే%ొ% అదే అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడిదారుల ప్రయోజనం!మన దేశమూ దీనికి అతీతం కాదు! నయా ఉదారవాద దుష్పరిణామాలు ఇప్పుడు దేశమంతా అనుభవించాల్సి వస్తోంది. సంస్కరణల్లో భాగంగా చేపట్టిన అమెరికా అనుకూల వైఖరి ఇప్పుడు మొదటికే మోసంగా మారుతోంది. ట్రంప్ టారిఫ్‌లతో వ్యవసాయం నుండి స్టార్టప్‌ల వరకు అన్ని రంగాలు కుదలయ్యే పరిస్థితి ఏర్పడింది. పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం సామాన్యుల బతుకులను ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. ఫలితంగా పెల్లుబుకే ఆగ్రహం నుండి ప్రజానీకాన్ని పక్కదోవ పట్టించడానికి ఆర్‌ఎస్‌ఎస్ నేతృత్వంలో కార్పొరేట్ల కన్నుసన్నల్లో నడిచే బిజెపి ప్రభుత్వానికి ఉన్న ఒకేఒక మార్గం మతోన్మాదాన్ని పెంచడం! ఇప్పటికే ఆ దిశలో సంకేతాలు కనపడుతున్నాయి. ప్రజానీకం, ముఖ్యంగా యువత అప్రమత్తంగా ఉండాలి. ప్రజలను చీల్చే ప్రతి ప్రయత్నాన్నీ ప్రతిఘటించి ఐక్యంగా నిలవాలి.

# మళ్లీ అమెరికాతో నెయ్యం



న్యూఢిల్లీ,ఇది స్పీడ్ యుగం. కరచాలనాలైనా, కలహాలైనా ఎంత త్వరగా మొదలవుతాయో అంత త్వరగానూ కనుమరుగవుతాయి. భారత్ అమెరికాల సంబంధాల తీరు గమనిస్తే ఇది అర్థమవుతుంది. నెల్లాళ్ల క్రితం దాదాపు ఛిద్రమయ్యాయనుకున్న ఈ సంబంధాల్లో మళ్లీ సుహృద్భావం మొగ్గ తొడుగుతోంది. ద్వైపాక్షిక ఒప్పందాన్ని సాధ్యమైనంత త్వరగా సాకారం చేసుకోవాలని మంగళవారం న్యూఢిల్లీలో అమెరికా వాణిజ్య దూత బ్రెండాన్ లించ్ నేతృత్వంలోని ప్రతినిధి వర్గంతో మన వాణిజ్య మంత్రిత్వ బృందం చర్చించాక అంగీకారం కుదిరింది. అంతేకాదు... ప్రధాని నరేంద్ర మోదీ పుట్టిన రోజు సందర్భంగా ట్రంప్ ఆయనకు ఫోన్‌చేసి శుభాకాంక్షలు చెప్పటం, దాన్ని ఎక్స్‌లో మోదీ ప్రస్తావించి రష్యా–ఉక్రెయిన్ ఘర్షణలకు శాంతియుత పరిష్కారం కోసం ట్రంప్ చొరవ తీసుకోవటాన్ని ప్రశంసించటం గమనించదగ్గవి. సరిగ్గా నెల్లాళ్ల క్రితం పరిస్థితి వేరు. రష్యా దురాక్రమణ యుద్ధం కొనసాగటానికి భారత్ వైఖరే ప్రధాన కారణమంటూ ట్రంప్ నిందించారు. అంత క్రితం ఆగస్టు మొదటి వారంలో విధించిన 25 శాతం సుంకాలతో పాటు రష్యా ముడిచమురు కొంటున్నందుకు ఆ నెల చివరిలో మరో 25 శాతం అదనంగా వడ్డించి దాన్ని 50 శాతానికి తీసుకెళ్లారు. కేవలం భారత్‌పై విషం కక్కడం కోసం నియమితులైనట్టుగా వైట్‌హౌస్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో మొదలుకొని వాణిజ్యమంత్రి హెవార్డ్ లుట్నిక్ వరకూ ఇష్టానుసారం మాట్లాడారు. వీరిలో నవారో మిగిలినవారికన్నా భిన్నం. ఆయన ఆశువుగా అబద్ధాలాడగలరు. ఆధారాలతోగానీ, ఇరు దేశాల చారిత్రక సంబంధ బాంధవ్యాలతో గానీ ఆయనకు పనిలేదు. ఫలానా కులానికి లబ్ధి చేకూర్చటం కోసం భారత ప్రభుత్వం కోట్లాది మంది ప్రజల ప్రయోజనాలను పణంగా పెడుతోందని వ్యాఖ్యానించగలరు. ఇరు దేశాల మధ్యా చర్చలు మొదలవుతున్న తరుణంలో కూడా భారత్‌ను 'ట్యారిఫ్‌ల మహారాజు' అనగలరు. తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించగలరు. మన దేశం ఎంతో సంయమనం పాటించబట్టే అయిదో రౌండ్ తర్వాత ఆగిపోయిన చర్చలు మళ్లీ ప్రారంభం కాబోతున్నాయి. మధ్యలో అనవసరంగా పేచీకి దిగి విపరీతాలకు పోయింది అమెరికాయే!భారత్‌పై అదనపు సుంకాలు విధించటాన్ని సవాల్ చేస్తూ అమెరికా సుప్రీంకోర్టులో దాఖలైన కేసు విచారణలో భారత్ రష్యా చమురుకొనటాన్ని ట్రంప్ సర్కారు కారణంగా చూపింది. ఇప్పుడు సుంకాలను వెనక్కి తీసుకుంటే ఆ కేసు బలహీనపడు తుంది.ట్రంప్‌కు దౌత్యపరమైన మర్యాదలు తెలియవు. తన చర్యల వల్ల అవతలి దేశం స్థానికంగా ఎదుర్కొనక తప్పని ఒత్తిళ్లేమిటో అర్థం కావు. అమెరికా పారిశ్రామిక ఉత్పత్తులపై విధించే సుంకాల్లో 95 శాతం కోత పెట్టడానికి మన ప్రభుత్వం అంగీకరించింది. కానీ 43 శాతం మంది గ్రామీణ ప్రజానీకానికి ఉపాధి కల్పిస్తున్న సాగు రంగాన్ని పణంగా పెట్టడానికీ, చిన్న వ్యాపారుల, పాడిపరిశ్రమ రంగ ఉత్పత్తిదారుల ప్రయోజనాలను దెబ్బతీసే నిర్ణయాలకూ తాము వ్యతిరేకమని మన ప్రభుత్వం కుండబద్దలు కొడుతోంది. జన్యుపరంగా మార్పిడి చేసిన మొక్కజొన్న మాకొద్దని చెబుతోంది. ఈ విషయంలో భారత్ మనోభావాలను అర్థం చేసుకోకుండా ఒక ధూర్త వ్యాపారిలా ట్రంప్ ప్రవర్తించారు. ఇప్పుడు తామే వెనక్కి తగ్గక స్థితిని సృష్టించుకున్నారు.తమ దయా దాక్షిణ్యాలపై ఆధారపడే దక్షిణ కొరియా, జపాన్‌లు సాగిలపడటాన్ని చూసి అందరిపైనా ఆ వ్యూహమే పనికొస్తుందని ట్రంప్ భావించటమే ఇందుకు కారణం. పెహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్తాన్‌తో చెట్టపట్టాలేసుకున్నారు. ఆ దేశ ఆర్మీ చీఫ్‌ను నెత్తిన పెట్టుకున్నారు. ఈ పరిణామాలతో భారత్ బెంబేలు పడుతుందని భావించారు. కానీ షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీవో) సమావేశానికి మోదీ చైనా వెళ్లటం, అక్కడి పరిణామాలూ గమనించాక జరగబోయేదేమిటో ఆలస్యంగానైనా గ్రహించక తప్పలేదు. భారత్‌కు తాను తప్ప దిక్కులేదనుకోవటం ఘోర తప్పిదమని గ్రహించారు. పర్యవసానంగానే ఇప్పుడు మళ్లీ పరిస్థితులు మారుతున్నట్టు కనిపిస్తున్నాయి. ఈ ప్రపంచంలో వ్యాపారం తప్ప మరేం లేదన్న వైఖరిని ట్రంప్ విడనాడితేనే ప్రపంచంతో ఆయనకు సామరస్యం కుదురుతుంది. అలా కానట్టయితే నష్టపోయేది అమెరికాయే!

# వక్ఫ్‌పై ఆగని న్యాయ, ప్రజా పోరాటాలు




న్యూఢిల్లీ,దేశవ్యాప్తంగా వక్ఫ్ ఆస్తులపై వివాదం కొనసాగుతూనే ఉంది. కేంద్ర ప్రభుత్వం తీసుకుని వచ్చిన వక్ఫ్ సవరణ చట్టంపై సుప్రీం కోర్టులో తీవ్ర వాదోపవాదాల అనంతరం ధర్మాసనం ఇచ్చిన పాక్షిక 'స్టే'తో ముస్లింలలో కొంత ఉపశమనం, మరి కొంత నిరుత్సాహం కలిగించింది. తుది తీర్పు వెల్లడించే వరకు, ముస్లింలకు న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగించాలని ముస్లిం సంఘాలు, మత పెద్దలు నిర్ణయించారు. మరోవైపు మజ్లీస్ పార్టీని మరింతగా బలోపేతం చేస్తూ దేశవ్యాప్తంగా విస్తరించాలనుకుంటున్న ఆ పార్టీ అధ్యక్షుడు, లోక్‌సభ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీకి కేంద్ర ప్రభుత్వం తీసుకుని వచ్చిన వక్ఫ్ చట్టం ఓ అస్త్రంగా మారిందని చెప్పవచ్చు. దేశవ్యాప్తంగా ముస్లింలను జాగురుత పరుస్తూ, తమ వైపు తిప్పుకోవడానికి ఇదొక సదవకాశంగా, బలమైన ఆయుధంగా పరిణమించింది. వక్ఫ్ చట్టాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయ చక్రం తిప్పుతున్నారన్న ఆరోపణలను ఎదుర్కొకుండా ముందుగానే జాగ్రత్త పడ్డారు.ఒకవైపు ముస్లిం పర్సనల్ లా బోర్డు ముందుండి న్యాయ పోరాటం చేస్తుండగా, అసద్ లోక్‌సభలో చట్టానికి వ్యతిరేకంగా గొంతెత్తడం, మరోవైపు మజ్లీస్ పార్టీ తో పోరాటాలు చేయిస్తూ ప్రజాక్షేత్రంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టే చర్యలకు దిగారు. ఇందులో భాగంగానే ఏప్రిల్ 18న నాంపల్లి దారుస్సలాంలోని మజ్లీస్ పార్టీ కేంద్ర కార్యాలయం ఆవరణలో భారీ ఎత్తున బహిరంగ సభ నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచీ జనాలు తరలి వచ్చారు. ముస్లిం పర్సనల్ లా బోర్డు బ్యానర్‌పై ఈ బహిరంగ సభ నిర్వహించినా, ప్రాంగణం మాత్రం మజ్లీస్ పార్టీదే. జమాయితీ ఉలేమా–ఇ–హింద్ వంటి సంస్థలు మద్దతు ప్రకటించగా, ఆమ్‌ఆద్మీ పార్టీ, సిపిఐ, డిఎంకె, జెడియు కూడా మద్దతు ప్రకటించాయి. బిఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతలనూ ఆహ్వానించగా, ఆ పార్టీ చోటా నాయకులను పంపించాయి.ఇంకా నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్‌లోనూ మజ్లీస్ సభలు నిర్వహించింది. నెక్లెస్ రోడ్డులో క్యాండిల్ ర్యాలీ నిర్వహించింది. జిల్లా కేంద్రాల్లోనూ ఆందోళనలు కొనసాగించింది. నగరంలోని మాసాబ్ ట్యాంక్ వద్ద గల హాకీ స్టేడియంలో మహిళా సదస్సు నిర్వహించింది. ఇలా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా మహారాష్ట్ర, బీహార్, పశ్చిమ బెంగాల్‌లోనూ అసద్ సభలు, సమావేశాలు నిర్వహించి వక్ఫ్ సవరణ చట్టంతో ముస్లిం సమాజానికి ఎదురవుతున్న నష్టం గురించి వివరించారు. మజ్లీస్ పార్టీ అనేగానే ఆ పార్టీ పాతనగరానికే పరిమితమనే భావన దేశవ్యాప్తంగా ఉంది. హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి అసద్ ప్రాతినిధ్యం వహిస్తుండగా, ఇంకా ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లను కైవసం చేసుకుని తిరుగులేని పార్టీగా మనుగడ సాగిస్తున్నారు. మజ్లీస్‌ను ఓడించేందుకు వివిధ పార్టీలు ప్రయత్నించి విఫలమయ్యాయి.ముఖ్యంగా మజ్లీస్‌కు వ్యతిరేకంగా ఆవిర్భవించిన మజ్లీస్ బచావో తహరిక్ (ఎంబిటి) ఎదురొడ్డి నిలవలేకపోయింది.మజ్లీస్ పార్టీ శాఖలను వివిధ రాష్ట్రాలకూ విస్తరించాలన్న బలమైన సంకల్పం, పట్టుదలతో అసద్ ఉన్నారు. అసదుద్దీన్ ఒవైసీ తాత ఫక్రీం మిల్లత్ అబ్దుల్ వాహీద్ అఖిల భారత మజ్లీస్ ఇత్తేహదుల్ ముస్లీమీన్ ను స్థాపించారు.ఆ రోజుల్లోనే అబ్దుల్ వాహీద్ ప్రముఖ న్యాయవాదిగా, ఇస్లాం స్కాలర్‌గా పేరు గడించారు. కుల, మతాలకు అతీతంగా, అణగారిన పేద ప్రజలకు అండగా నిలవాలన్న సంకల్పంతో మజ్లీస్‌ను ఒక స్వచ్ఛంద సంస్థగా స్థాపించారు. కాలక్రమేణా రాజకీయ పార్టీగా అవతరించింది. అసద్ తండ్రి 'సాలార్'గా పేరొందిన సుల్తాన్ సలావుద్దిన్ ఒవైసీ కూడా ఈ దిశగా పార్టీని ముందుకు నడిపించడంలో కృతకృత్యులయ్యారు. పార్టీ పరిమితిని పాతనగరానికే కాకుండా వివిధ రాష్ట్రాలకు విస్తరించాలని మహారాష్ట్ర, కర్నాటకలో పలు ఎన్నికల్లో ఇంకా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కడప, కర్నూలు తదితర ప్రాంతాల్లో శాఖలను విస్తరించారు.ఇప్పుడు అసద్ దేశవ్యాప్తంగా పార్టీని బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ మేరకు మహారాష్ట్ర, బీహార్, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల్లో ఎంపి, ఎంఎల్‌ఏ, కార్పొరేషన్ల ఎన్నికల్లో తన బలమైన అభ్యర్థులను దించుతూ ముందుకు సాగుతున్నారు. ఇక్కడ కూడా అసద్ వ్యూహాత్మకంగానే ముందుకు సాగుతున్నారు. అసోంలో ఏఐయుడిఎఫ్, కేరళలో ముస్లిం లీగ్, కశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్, పిడిపి ఉన్నందున, ఆ రాష్ట్రాల్లోకి మజ్లీస్‌ను తీసుకెళ్ళే ప్రయత్నం చేయడం లేదు. అక్కడ కూడా మజ్లీస్ శాఖలను విస్తరిస్తే అక్కడ ముస్లింలకు అండగా ఉన్న పార్టీలకు నష్టం కలుగుతుందనేది ఆయన భావన. ఈ రాష్ట్రాలు మినహా మిగతా రాష్ట్రాల్లో మజ్లీస్‌ను విస్తరించేందుకు కృషి చేస్తున్న అసద్ చేతికి ఇప్పుడు వక్ఫ్ సవరణ చట్టం ఓ ఆయుధంగా అవకాశం కలిసి వచ్చింది. వక్ఫ్ ఆస్తులన్నీ రిజిస్టర్ చేసుకోవాలన్న నిబంధనను వక్ఫ్ సవరణ చట్టంలో పొందుపరచడం ముస్లిం వర్గాలను షాక్‌కు గురి చేసింది. దేశం లో వందల ఏళ్ళుగా వేల సంఖ్యలో 'వక్ఫ్ బై యూజర్' ఆస్తులు ఉన్నాయని మజ్లీస్ తోపాటు వందకు పైగా పిటిషన్లు సుప్రీంకోర్టులో దాఖలయ్యాయి.ఇతర సామాజిక వర్గానికి చెందిన వారిని వక్ఫ్ బోర్డులో సభ్యులుగా నియమించాలని సవరణ చట్టంలో పేర్కొనడంపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు పిటీషనర్లు. హిందూ మత ట్రస్టు బోర్డుల్లో అన్యమతస్థులకు, ముఖ్యంగా ముస్లింలకు చోటివ్వగలరా? అని సుప్రీం కోర్టు డిఫెన్స్ లాయర్‌ను ప్రశ్నించడంతో ముస్లిం సంఘాలు, ముస్లిం పర్సనల్ లా బోర్డు, ఇంకా అసద్ హర్షం వ్యక్తం చేశారు. వక్ఫ్ ఆస్తులకు సంబంధించి కలెక్టర్ల నిర్ణయాధికారాన్ని కోర్టు నిలిపివేయడం, వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరుల సంఖ్యను కుదించడం వంటి ఆదేశాలతో తాత్కాలిక 'స్టే' తో 128 పేజీలతో ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. అత్యున్నతమైన న్యాయ వ్యవస్థపై నమ్మకం ఉందని, న్యాయం జరుగుతుందన్న భావన ముస్లిం వర్గాల్లో వ్యక్తమవుతోంది. వక్ఫ్ చట్టాన్ని కేంద్రం పూర్తిగా విరమించుకునేంత వరకూ న్యాయ, ప్రజా పోరాటాలు కొనసాగించాలని మజ్లీస్‌తోపాటు అనేక ముస్లిం సంఘాలూ పట్టుదలగా ఉన్నాయి. దీనిపై కోర్టు మధ్యంతర తీర్పే కాబట్టి తుది తీర్పు వరకూ వేచి చూడాల్సిందే.

# తెలంగాణ పట్ల కేంద్రం వివక్ష..యూరియా సరఫరాలో నిర్లక్ష్యం

ఆదిలాబాద్,యూరియా విషయంలో స్పష్టత లేని కేంద్రం, రాష్ట్రాల పట్ల నిర్లక్ష్యం వహించిందని మాజీకేంద్రమంత్రి, కాంగ్రెస్ నేత డాక్టర్ ఎస్. వేణుగోపాలాచారి అన్నారు. రాష్ట్రాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నా కేంద్రం ఇప్పటి వరకు ఏ ఒక్క ప్రకటన చేయలేదన్నారు. దీనికితోడు రాష్ట్రంలోని బిజెపి ఎంపిలు, మంత్రులు అనవసరంగా నోరు పారేసుకోవడం సరికాదన్నారు. ఇకపోతే కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన నిధులపైన, హామీలపైన స్పష్టత ఇవ్వడంలో విఫలమైన కేంద్రంపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. యూరియాపై ఎందుకు స్పష్టత ఇవ్వరని అన్నారు. ఇప్పుడు దేశంలో ఆహార కొరతకు, ధాన్యం రేట్లు పెరగడానికి కారణం ఎవరని అన్నారు. తెలంగాణ పండించిన ధాన్యాన్ని బేషరతుగా కొనివుంటే ఇవాళ ఇంతటి సంక్షోభం వచ్చి ఉండేది కాదన్నారు. ఇంతకాలం తాము సంయమనంతో వ్యవహరించామని అన్నారు. తమ ఎంపిలు పార్లమెంటులో పోరాడినా లాభం లేకుండా పోయిందన్నారు. కేంద్రం నీతి ఆయోగ్ ఏర్పాటు చేసినప్పుడు చేసిన ప్రకటనలకు తాజాగా అనుసరిస్తున్న విధానాలకు పొంతన లేకుండా ఉందన్నారు. నిధుల విడుదలలో తెలంగాణకు అన్యాయం జరుగు తోందన్నారు. బిజెపి ఎంపిలు కూడా తప్పుదోవ పట్టించడం తగదన్నారు. తెలంగాణలో హుంకరిస్తున్న నేతలు ఈ నేలకు ఏంచేశారో చెప్పాలన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యమని వారు గుర్తించాలన్నారు. అనేక విషయాల్లో కేంద్రం తెలంగాణపై చిన్నచూపు చూస్తోందని విమర్శించారు. ఈ సమస్య తెలంగాణకు సంబంధించిందే కాదని.. దాదాపు చాలా రాష్ట్రాలకు సంబంధించిందన్నారు. ఆర్థిక సంఘం బకాయిలు, గ్రామీణాభివృద్ధి నిధులు తక్షణమే విడుదల చేయాలని కొత్త ప్రభాకర్ రెడ్డి కేంద్రాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రాలకు కేంద్రం సహకరిస్తేనే దేశం అభివృద్ధి చెందుతుందని సూచించారు.

# అనేక గ్రామాల్లో తొలగని బురద

ఏలూరు, ఏటా వానాకాలంలో అంటు వ్యాధులు ప్రబలడం సర్వసాధారణంగా మారింది. చలికాలం వచ్చే సరికి స్వైన్ ఫ్లూ లాంటి వ్యాధులు విజృంభిస్తుంటాయి. పట్టణాలు,పల్లెలు అనే తేడా లేకుండా స్వచ్ఛంగా ఉంచాలని పదేపదే ప్రచారం చేస్తున్నా ప్రజలు పట్టించుకోవడం లేదు. ఎవరికి వారు తమకేంటన్న భావనతో అపరిశుభ్రతకు కారణమవుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఇటీవలి వర్షాలు వరదల కారణంగా పలుప్రాంతాలు కంపు కొడుతున్నాయి. అనేక లంకగ్రామాలు, విలీన మండలాల గ్రామాలు ఇంకా బురదలోనే ఉన్నాయి.ప్రజలు దీంతో సహవాసం చేస్తూ అవస్థలు పడుతున్నారు. మురుగునీటి పారుదల సక్రమంగా లేకపోవడం వల్ల ఏలూరులో వింతవ్యాధి ఇటీవల ప్రజలను తీవ్రంగా భయపెట్టింది. ఇకపోతే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నామని నాయకులు చెపుతున్నా వాస్తవం వేరే రకంగా కనిపిస్తోంది. పారిశుధ్య లేమి కారణంగానే ఇటువంటి వ్యాధులు ప్రబలు తున్న విషయం సుస్పష్టం. అపరిశుభ్రత కారణంగా దోమలు విజృంభించడం, వింతవ్యాధులు విజృంభించడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నది. సీజనల్ వ్యాధుల నివారణ ప్రజల భాగస్వామ్యం తోనే సాధ్యమవుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు. బహిరంగ ప్రదేశాలు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపాలిటీలు దోమల నివారణతో పాటుగా పారిశుధ్య నిర్వహణ చేసేందుకు అన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో పారిశుధ్య నిర్వహణ పైన దృష్టి సారించి, ప్రభుత్వ ప్రయత్నాలతో కలిసి రావాలి.ముఖ్యంగా దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు సొంత ఇళ్లలోని పారిశుద్యం అత్యంత కీలకమైన అంశం. ఇళ్ళలో పారిశుద్ధ్య నిర్వహణ కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాల్సి ఉంది. ఎప్పటికప్పుడు ప్రజలను చైతన్యవంతం చేసి, పారిశుద్ధ్య నిర్వహణలో వారిని భాగస్వాములను చేసేందుకు ప్రభుత్వ అధికారులు, పురపాలక ప్రతినిధులు కృషి చేస్తూనే ఉన్నారు. ఇళ్ళలో పారిశుధ్య నిర్వహణ చేపట్టి ప్రజలకు ఆదర్శంగా నిలవాలని పదేపదే కోరుతున్నారు. ముఖ్యంగా దోమల వృద్ధికి అవకాశం ఉన్న ఉన్న నీటి తొట్లు, నీటి నిలువ ప్రదేశాల్లో నీటిని తొలగించే చర్యలు తీసుకోవాలన్నారు. దీంతోపాటు ఇంటి మూలల్లో ఉన్న ఉపయోగంలో లేని వస్తువులను తీసివేసి, దోమల లార్వా వృద్ధికి అవకాశం లేకుండా చేసే చర్యలను చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి పారిశుధ్య నిర్వహణ పైన పైన దృష్టి సారించి సీజనల్ వ్యాధుల బారి నుంచి కాపాడుకునే ప్రయత్నం ప్రారంభిం చాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఇళ్ళ ముందు కానీ లేదా ఇంటి లోపల నీటి నిలువ ఉండే ప్రాంతాల్లో నీటిని తొలగించే ప్రయత్నం చేయడం లేదా వాటిపైన నూనెను చల్లడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. దీంతోపాటు ఇళ్లలో ఉన్న పనికిరాని లేదా ఉపయోగం లేని లేని వస్తువులను తొలగించుకోవాలని కోరారు. అప్పుడేసీజనల్ వ్యాధులను రాకుండా నిరోధించగలమని అన్నారు. కాలువల్లో వాడిపడేసిన వ్యర్థాలను, స్లాస్టిక్‌ను పడేయడం వల్ల కూడా మురికినీరు నిలిచి పోతోంది. దీనికి ప్రజలే బాధ్యత వహించాలి.

# మహిళలపై అకృత్యాలకు చర్యలేవీ

అమరావతి,ఇటీవల నల్లగొండలో ఫోక్సో కోర్టులు రేపిస్టులకు జైలుశిక్షలు వేశాయి. సీవిత ఖైదు విధించాయి. అయితే ఇవన్నీ ఆలస్యంగానే అమలవుతున్నాయి. కఠిన శిక్షలు వెంటనే అమలు కావాల్సిన అసవరం ఉంది. ఎన్ని కఠిన చట్టాలను తీసుకుని వచ్చినా లైంగిక వేదింపులు, ప్రేమదాడులు ఆగడం లేదు. అలాగే వరుస ఘటనలు ఎపిలో ఆందోళన కలిగిస్తున్నాయి. మృగాళ్ల కారణంగా ఆడపిల్లలకు భయం కలుగుతోంది. ఆడపిల్లలను కన్న తల్లిదండ్రులు మరింత క్షోభకు గురవుతున్నారు. ఇప్పుడు భయపడేలా పరిస్థితులు దాపురించాయి. దేశవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలకు కఠిన శిక్షలు పడేలా చూడాలని సత్వర శిక్షలు అమలు చేయాలని యావత్ దేశం కోరుకుంటున్న వేళ కఠిన చట్టాలపై ఆలోచన చేయాలి. మహిళలు, బాలికలపై అత్యాచారాలు, అఘాయిత్యాలకు పాల్పడితే ఉరిశిక్ష విధించేలా చట్టాన్ని రూపొందించాలి. దీనిని నిర్ధారించే ఆధారాలున్నప్పుడు 21 రోజుల్లోనే తీర్పు ఇచ్చేలా చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవాలి. మహిళలపై అత్యాచారానికి పాల్పడితే అతి త్వరగా నిందితులకు మరణశిక్ష పడేలా చట్టం తీసుకుని రావాలి ఇటువంటి కేసుల్లో నిందితులను దోషులుగా నిర్ధారించే ఆధారాలున్నప్పుడు మూడు వారాల్లోగా అంటే 21 వర్కింగ్ డేస్ ల్లో తీర్పు వచ్చేలా క్రిమినల్ లా చట్టంలో మార్పులు తేవాలి.. కానీ ఇటీవలి ఘటనలు మృగాళ్లలో భయాన్ని కలిగించడం లేదని తెలిస్తోంది. ప్రేమించిన అమ్మాయి పెళ్లికి నిరకారించందనో లేక తనను ప్రేమించడం లేదనో లేకపోతే..ఒంటరి అమ్మాయిలను లేదా మహిళలను లక్ష్యంగా చేసుకుని రెచ్చిపోతున్నారు. రేప్‌లు చేయడం, హత్యలు చేయడం చాలా సులువైన పనిగా చూస్తున్నారు. మహిళలు, చిన్నారులపై నేరాల విచారణకు ప్రతి జిల్లాలోను ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టుల్ని ఏర్పాటు చేయాలి. అత్యాచారం, యాసిడ్ దాడులు, వేధింపులు, లైంగిక వేధింపులు వంటి హింసాత్మక ఘటనల్లో నేరాల విచారణకు ప్రతి జిల్లాల్లోను ప్రత్యే కోర్టుల ఏర్పాటుకు ప్రభుత్వాలు ముందుకు రావాలి. అంతేకాదు సోషల్ మీడియా వేదికగా బాధిత మహిళలకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రచారాలకు అడ్డుకట్టవేసేలా చట్టాన్ని రూపొందించాలి. మహిళల గౌరవానికి భంగం కలిగించేలా పోస్టింగ్‌లు పెట్టేవారిపై ఉక్కుపాదం మోపాలి. నిజానికి ఆడవాళ్లపై అకృత్యాలు జరిగిన వెంటనే ఉపశమనం కలిగే చట్టం రావాలని తల్లిదండ్రులు, ప్రతి మహిళ, చెల్లి, ప్రతి ఇంట్లోని ఆడపిల్ల ఎదురు చూస్తోంది. ప్రభుత్వం కఠిన చట్టంతో మహిళలకు భద్రత ఇస్తోందన్న భరోసా రావాలి. అయితే చట్టాలు ఉన్నా ప్రజల్లో మార్పులు మాత్రం రావడం లేదు. దుండగులను కఠినంగా అణచివేస్తే తప్ప మహిళలకు రక్షణ ఉండదని తేలిపోయింది. కఠినంగా అణచివేత చర్యలకు ఉపక్రమించాలన్ని సర్వత్రా విజ్ఞప్తులు వస్తున్నాయి. భయం కలిగేలా పోలీసులు వ్యవహరించాలని కూడా యువతులు కోరుకుంటున్నారు.

# ఎందుకు వెళ్లిపోతోంది?

హైదరాబాద్,హైదరాబాద్ నగరంలో దీర్ఘకాలంగా మెట్రో రైల్ ను ఎల్ అండ్ టీ సంస్థ నిర్వహిస్తోంది.. సేవల విషయంలోనూ సమర్థవంతంగా వ్యవహరిస్తోంది. అయితే అటువంటి సంస్థ మెట్రో రైలు ప్రాజెక్టు నుంచి తప్పుకుంటామని వ్యాఖ్యానించడం సంచలనం కలిగిస్తోంది. దీనికి తోడు ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి కీలక నాయకుడు కేటీఆర్ ముడుపుల వల్లే ఎల్ అండ్ టీ మెట్రో నుంచి వెళ్ళిపోతోందని ఆరోపించారు. దీంతో ఎల్ అండ్ టీ వ్యవహారం రాజకీయంగా సంచలనంగా మారింది..మెట్రో ప్రాజెక్ట్ నుంచి పదేపదే వెళ్ళిపోతామని ఎల్ అండ్ టీ చెబుతుండడం పట్ల రేవంత్ ప్రభుత్వం కూడా సీరియస్ గానే దృష్టి సారించినట్టు తెలుస్తోంది.. పదేపదే వెళ్ళిపోతామని చెబితే.. దానికి తాము సరే అంటామని ప్రభుత్వం చెప్పినట్టు తెలుస్తోంది. మెట్రో రెండో దశ ప్రాజెక్టు ను రాష్ట్ర ప్రభుత్వమే నిర్మించి.. నిర్వహించాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఈ పరిణామాలు జరుగుతున్న నేపథ్యంలో మొదటి దశ కూడా తామే నిర్వహిస్తామని ప్రభుత్వం ముందుకు వచ్చినట్టు తెలుస్తోంది.. అప్పులు, వడ్డీలు అధికంగా ఉన్నాయని ఎల్ అండ్ టీ చెబుతుండగా.. ఇచ్చిన ఆస్తులు నిర్వహణ సరిగా లేదని ప్రభుత్వం అసంతృప్తితో ఉంది.

# ఆదాయం ఏది..

అమరావతి,రాష్ట్ర ప్రభుత్వం వరుసగా చేస్తున్న కార్యక్రమాలను గమనిస్తే ఖర్చు తప్ప ఆదాయం కనిపించడం లేదన్నమాట వినిపిస్తోంది. ఇది విపక్ష నాయకులు చేసే విమర్శ అవుతుంది. కానీ స్వపక్షంలోని నాయకులే పెదవి విరిచే పరిస్థితి కనిపిస్తుండడం విశేషం. రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం మాట ఎలా ఉన్నా ఖర్చుపై అసలు పగ్గాలు లేకుండా వ్యవహరిస్తోందన్నది టిడిపి నాయకులు చేస్తున్న విమర్శ. ఖర్చును అదుపు చేసుకునే క్రమంలో కొన్ని కొన్ని కార్యక్రమాలను తగ్గించాలని గత నెలలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు స్వయంగా చెప్పారు.రాష్ట్రంలో పొదుపు పాటించాల్సిన అవసరం ఉందని కూడా ఆయన మాట్లాడారు. ఈ వ్యాఖ్యలను కోట్ చేస్తూ ఓ సీనియర్ నాయకుడు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ గా మారాయి. రాష్ట్ర ప్రభుత్వం వరుసగా చేస్తున్న కార్యక్రమాల ద్వారా రాష్ట్రానికి గాని ప్రభుత్వానికి గానీ రూపాయి ఆదాయం లేకపోగా ఖర్చు మిగులుతుందని అన్నది ఆయన చెప్పిన మాట. ఇటీవల తిరుపతి వేదికగా పార్లమెంటు, అసెంబ్లీ మహిళా ప్రజా ప్రతినిధుల సాధికారత సదస్సును నిర్వహించారు. దీనికి సుమారు 80 నుంచి 120 కోట్ల రూపాయల వరకు ఖర్చయినట్లు అధికారులు చెబుతున్నారు.ఇంత భారీ కార్యక్రమానికి వేదిక కావడం గొప్ప విషయమని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ.. రావాల్సినంత మైలేజీ రాకపోగా ఇది అనవసరపు ఖర్చు అనే మాట వినిపిస్తుండడం రాజకీయ వర్గాల్లోనే కాదు ప్రభుత్వ వర్గాల్లోనూ చర్చకు దారితీసింది. 80 కోట్ల రూపాయల నుంచి 120 కోట్ల రూపాయలు ఖర్చుపెట్టిన ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఒరిగిన ప్రయోజనం ఏమీ కనిపించడం లేదన్నది కూడా అధికార పార్టీ నేతల మాట. మహిళా ప్రజా ప్రతినిధులు, వారు ఎదుర్కొంటున్న సమస్యలు వంటి అంశాలపై రెండు రోజుల పాటు తిరుపతిలో సభ పెట్టారు. దీనికి పార్లమెంటు నుంచి స్పీకర్లు అదేవిధంగా మహిళా పార్లమెంటరీ నాయకులు రాష్ట్రాల నుంచి అసెంబ్లీ ఎమ్మెల్యేలు ఇలా సుమారు 600 మంది దాకా హాజరయ్యారు.వీరికి తోడు వారి పిఏలు మీడియా ప్రతినిధులు కూడా వచ్చారు. దీంతో ఖర్చు తడిసి మోపెడైందన్నది అధికారులు చెబుతున్న మాట. దీనివల్ల ప్రయోజనం లేకపోగా ఖర్చు పెరిగిందని వారు లెక్కలు చెప్తున్నారు. ఇక ఇటీవల రెండు రోజుల పాటు నిర్వహించిన కలెక్టర్లు, ఎస్పీల సదస్సు కూడా దాదాపు 10 కోట్ల నుంచి 15 కోట్ల రూపాయలు ఖర్చును మిగిల్చింది. ఇది కూడా వాస్తవం. జిల్లాల కలెక్టర్లకు రావడానికి, పోవడానికి అయ్యే ఖర్చులతో పాటు వారికి కల్పించిన ఉన్నత స్థాయి సౌకర్యాలు, ఉండేందుకు హోటళ్లు, భోజనం.. వారి పిఏలు అదేవిధంగా సెక్రటరీలు ఇలా అన్నీ రూపాయలపాలే.. ప్రభుత్వం పై పది నుంచి 15 కోట్ల రూపాయల వరకు భారం పడింది.ఇక తరచుగా చేస్తున్న ఢిల్లీ పర్యటనల ఖర్చు కూడా మరింత ఎక్కువగా ఉంటున్నది ప్రభుత్వ వర్గాల్లోనే జరుగుతున్న చర్చ. ఇటీవల చంద్రబాబు వరుసగా రెండుసార్లు ఢిల్లీకి వెళ్లారు. దీనికి ముందు నారా లోకేష్ కూడా ఢిల్లీ పర్యటనలు చేశారు. పర్యటనలకు వెళ్లడం తప్పు కాదు. కానీ, వృథా పర్యటనల వల్ల ఆర్థికంగా భారం పడుతున్నది అధికారులు చెబుతున్న మాట. దీనివల్ల ఖజానాపై భారం పడి అప్పులు చేయాల్సిన పరిస్థితి కూడా ఏర్పడుతుంది.వృథా ఖర్చులను తగ్గించాలని చెబుతున్న సీఎం చంద్రబాబు.. వృథా ఖర్చులకు కారణంగా ఉండే కార్యక్రమాలను నిర్వహించడం ఎందుకన్నది ప్రశ్న. మొత్తానికి వృథా ఖర్చును కనుక తగ్గించుకోకపోతే ఆర్థిక పరిస్థితి మరింత ఇబ్బందిగా మారుతుంది అన్నది ఆర్థిక శాఖ వర్గాలు కూడా వ్యాఖ్యానిస్తున్నాయి. ఎవరూ బయటకు చెప్పకపోయినా.. అంతర్గతంగా మాత్రం ఈ విషయంపై సచివాలయంలో తీవ్ర స్థాయిలో చర్చ జరుగుతుండడం గమనార్హం.

# విజయమ్మ ఇంకేం చెప్పారు?

హైదరాబాద్,ఆస్తుల పంపిణీకి సంబంధించి దివంగత మహానేత వైఎస్ కుటుంబ సభ్యుల మధ్య నడుస్తున్న పంచాయితీకి సంబంధించి చెన్నైలోని జాతీయ కంపెనీ లా అప్పీలెట్ ట్రైబ్యునల్ కు తాజాగా విజయమ్మ కీలక అంశాల్ని నివేదించారు. సరస్వతి పవర్ లిమిటెడ్ లో వాటాల బదలాయింపు.. రిజిస్టర్ లో వాటాదారుల పేర్ల మార్పుపై జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ హైదరాబాద్ బెంచ్ లో వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిటిషన్ దాఖలు చేయటం తెలిసిందే. దీనికి సంబంధించి విజయమ్మ తాను దాఖలు చేసిన పిటిషన్ లో తన వాదనను వినిపించారు.వైఎస్ జగన్మోహన్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ కు సంబంధించి ఇదేమీ కార్పొరేట్ వివాదం కాదని.. షర్మిలకు జగన్ కు మధ్య ఉన్న రాజకీయ కలహాల్ని పరిష్కరించుకునే ప్రయత్నం తప్పించి మరోటి కాదంటూ ఆమె పేర్కొన్నారు. ఇద్దరూ తన పిల్లలు కావటంతో వారి రాజకీయ గొడవల్లో తాను చిక్కుకున్నట్లు పేర్కొన్నారు. కుటుంబ వివాదానికి కార్పొరేట్ రంగు పులిమి వాటిని తమ రాజకీయ మైలేజీకి వినియోగించుకోవటం విచారకరమని వాపోయారు.అసలీ వివాదంలోకి వెళితే.. విజయమ్మ.. జనార్దన్ రెడ్డిల పేర్లతో వాటాలను బదలాయిస్తూ సరస్వతి పవర్ బోర్డు తీర్మానాన్ని.. దీని ప్రకారం రిజిస్టర్ లో సభ్యుల పేర్లను మార్చటాన్ని జగన్.. భారతీరెడ్డి.. క్లాసిక్ రియాల్టీలు సవాలు చేయటం తెలిసిందే. వాటాల బదలాయింపును రద్దు చేస్తూ జగన్ తదితరుల పేర్లను పునరుద్ధరించాలని కోరుతూ జులై 29న తీర్పు వెలువడింది.హైదరాబాద్ లోని జాతీయ కంపెనీ లా అప్పీలెట్ ట్రైబ్యునల్ వెలువరించిన తీర్పును సవాలు చేస్తూ.. దాని అమలును నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ చెన్నైలోని ట్రైబ్యునల్ కు విజయమ్మ అప్పీలు దాఖలు చేశారు. విజయమ్మ తరఫున ఆమె లాయర్ ఈ అప్పీల్ ను దాఖలు చేశారు. ఇందులో భాగంగా విజయమ్మ దాఖలు చేసిన పిటిషన్ లో ఆమె పలు అంశాల్ని ప్రస్తావించారు. ఈ పిటిషన్ ను చెన్నై ట్రైబ్యునల్ త్వరలో విచారించనుంది.విజయమ్మ దాఖలు చేసిన పిటిషన్ లో పేర్కొన్న అంశాల్ని చూస్తే.. “1999లో సరస్వతి పవర్ ఏర్పాటైంది. ఈ సంస్థకు గుంటూరులో 903.28 ఎకరాల భూమి ఉంది. వాటాల బదలాయింపునకు ముందు జగన్ కు 29.88 శాతం.. భారతీరెడ్డికి 16.30 శాతం.. క్లాసిక్ రియాల్టీకి 4.83 శాతం.. నాకు (విజయమ్మ) 48.99 శాతం వాటాలున్నాయి. 2021 జులై 26న జగన్ 74.26 లక్షల.. భారతీరెడ్డి 40.50 లక్షల వాటాల్ని ప్రేమతో నా పేరు మీద గిఫ్టు డీడ్ ఇచ్చారు. తర్వాత మాట మార్చి..వాటి ఆధారంగా జరిగిన లావాదేవీలను కార్పొరేట్ వివాదం పేరుతో ప్రశ్నించటానికి వీల్లేదు” అని పేర్కొన్నారు.క్లాసిక్ రియాల్టీతో రూ.3.07 కోట్లు చెల్లించి 11.38 లక్షల వాటాల్ని కొనుగోలు చేశానని.. వాటాలను కానుకగా ఇచ్చినట్లుగా విజయమ్మ పేర్కొన్నారు. “2021 ఆగస్టు 14న జగన్మోహన్ రెడ్డి డైరెక్టర్ పదవికి రాజీనామా చేశారు. దీంతో సరస్వతి కంపెనీతో అతనికున్న బంధం ముగించినట్లుగా జగన్ భావించారు. గిఫ్టు ఒప్పందాలను.. వాటాల కొనుగోలు ఒప్పందాల చెల్లుబాటును ఏ సివిల్ కోర్టులోనూ సవాలు చేయలేదు. అలాంటప్పుడు కార్పొరేట్ ముసుగులో వాటిని ట్రైబ్యునల్ లో సవాలు ఎలా చేస్తారు?” అని ఆమె ప్రశ్నించారు.జగన్ తో తాను కలిసి ఉన్నప్పుడే తనకు వాటాల్ని కానుకగా ఇచ్చినట్లుగా పేర్కొన్న విజయమ్మ.. “అప్పుడు ఒరిజనల్ వాటా సర్టిఫికేట్ లు.. వాటాల బదలాయింపు దరఖాస్తుల్నిఇవ్వగా నాతో వాటిని ఉంచుకున్నా. ఆ తర్వాత ఫ్యామిలీలో వివాదాలు.. విభేదాలు తలెత్తాయి. రాజకీయ విభజనకు దారి తీసింది. ఈ వివాదాల వేళ జగన్ నన్ను.. కుటుంబ సభ్యుల్ని వదిలేసి వెళ్లిపోయారు. ఒరిజనల్ వాటా సర్టిఫికేట్లను జగన్ ఎస్ సీ ఎల్ టీలో పిటిషన్ వేసిన సమయంలో జత చేయలేదు. కంపెనీ చట్ట నిబంధనల ఉల్లంఘన జరగలేదంటూ కౌంటర్ దాఖలు చేసిన తర్వాత ఒరిజినల్ సర్టిఫికేట్లను

# నరమేధమే ఇజ్రాయెల్‌కు ఆమోదమా!

గాజా,గాజాలో ఇజ్రాయెల్ దారుణ మారణహోమానికి అగ్రనాయకులే ఆజ్యం పోస్తున్నారని ఐక్యరాజ్యసమితి మానవహక్కుల మండలి కమిషన్ మంగళవారం వెలువరించిన 72 పేజీల నివేదికలో అనేక వాస్తవాలు బయటపడ్డాయి. పాలస్తీనా ప్రజలకు నిలువనీడ లేకుండా చేయడమేకాక సామూహిక హత్యాకాండకు పాల్పడుతోందని నివేదిక స్పష్టం చేసింది. రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత 1948లో ఐక్యరాజ్యసమితి జర్మనీలో హిట్లర్ ఊచకోతలను ప్రామాణికంగా తీసుకొని 'సామూహిక హత్యాకాండ' అంటే ఏమిటో నిర్వచించింది. దీనినే జీనోసైడ్ కన్వెన్షన్ (జాతి నిర్మూలన నివారణ సదస్సు)అని పిలుస్తారు. ఈ కన్వెన్షన్‌లో సూచించిన నిబంధనలు ప్రకారం సామూహిక మారణ కాండను తీవ్ర నేరంగా పరిగణిస్తారు. నాజీ జర్మనీలో హిట్లర్ 60 లక్షల మంది యూదులను గ్యాస్ ఛాంబర్‌లో పెట్టి ఊచకోత కోసిన మారణకాండ చరిత్రలో మరువరాని తీవ్ర విషాద ఘట్టం.అదే విధంగా ఇప్పుడు ఇజ్రాయెల్ 2023 అక్టోబర్ నుంచి ఇప్పటివరకు 1948 జీనోసైడ్ కన్వెన్షన్‌లోని అయిదు మారణకాండ చర్యల్లో నాలుగింటికి పాల్పడిందని ఐరాస కమిషన్ తన నివేదికలో స్పష్టం చేసింది. ఈ నివేదిక హమాస్ తయారు చేసిన అబద్ధాల పుట్టగా ఇజ్రాయెల్ కొట్టిపారేయడం మామూలే. కొన్ని వేల బతుకుల చితిమంటలతో ఓవైపు ఇజ్రాయెల్, మరోవైపు పరోక్షంగా అమెరికా చలి కాచుకుంటున్నాయి. ఇజ్రాయెల్ అధ్యక్షుడు నెతన్యాహు ట్రంప్ కనుసన్నల్లో మసలే అత్యంత సన్నిహితుడే. ట్రంప్ గట్టిగా తలంచుకుంటే ఇజ్రాయెల్ యుద్ధాన్ని ఆపించగలరు. కానీ అలా ప్రయత్నించకుండా కొనసాగింప చేయడమే ట్రంప్ వ్యూహం. కాల్పుల విరమణకు సంబంధించి ట్రంప్ ప్రతిపాదన ప్రకారం ఇటీవల దోహా లో ఖతార్ అధికారులు, హమాస్ నేతలు చర్చలు సాగించారు.ఈ చర్చలు జరుగుతుండగానే ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడిందంటే ట్రంప్ ప్రతిపాదన బేఖాతరు చేసినట్టే. ఖతార్ తనకు ముఖ్యమైన మిత్రదేశమని దానిపై దుందుడుకుగా వ్యవహరించవద్దని ట్రంప్ హెచ్చరించడం కేవలం కంటితుడుపే. ఖతార్‌పై ఇజ్రాయెల్ గతవారం మెరుపుదాడులు చేసి హమాస్ ముఖ్య నేతలను హతమార్చిన సంగతి తెలిసిందే. ఈ దాడుల సంగతి ఖతార్‌కు తెలియకుండా అశ్వత్థామ హతః కుంజరః అన్నట్టు అమెరికా వ్యవహరించడం ఎవరికి తెలియనిది కాదు. తాము ముందుగానే సమాచారం ఖతార్‌కు అందించామని ట్రంప్ సన్నాయి నొక్కులు నొక్కడంలో చెప్పలేదనే సంగతి బయటపడింది. ఇజ్రాయెల్ దాడిపై ఆగ్రహంతో ఉన్న ఖతార్ పాలక వర్గాలను ఓదార్చడానికి ఇజ్రాయెల్ నుంచే అమెరికా రక్షణ మంత్రి మార్కొరూబియో వెళ్తుండడం, అంతకు ముందు ఇజ్రాయెల్ నెతన్యాహుతో తానతందాన అంటూ హమాస్‌ను పూర్తిగా నిర్మూలించాల్సిందేనంటూ వంతపాడడం దేనికి సంకేతం ? హమాస్ చెరలో బందీలుగా ఉన్న మిగతా 48 మందిని విడిపించుకోడానికి హమాస్‌ను పూర్తిగా నిర్మూలించడమే తమ లక్షమని ఇజ్రాయెల్ బాహాటంగా ప్రకటిస్తోంది.ఇజ్రాయెల్ యుద్ధాన్ని ముగించి వైదొలిగితే కాని తాము బందీలను విడిచిపెట్టేది లేదని హమాస్ కరాఖండీగా చెబుతోంది. కొండలు కొండలు ఢీకొని గొర్రె పిల్లలు చనిపోయినట్టు ఇరువర్గాల భీషణ ప్రతిజ్ఞలకు అభమూ శుభమూ తెలియని కొన్ని వేల మంది సామాన్య పౌరులు రాలిపోతున్నారు. వీరిలో ఎక్కువ శాతం మహిళలు, చిన్నారులే. పాలస్తీనా ఆరోగ్యశాఖ వివరాల ప్రకారం 2023 అక్టోబర్ 7 నుంచి 65 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో హమాస్‌కు చెందిన వారు ఎంతమంది ఉన్నారో తెలీదు. అక్టోబర్ 7 దాడులకు ముందునుంచే ఇజ్రాయెల్ పాలస్తీనాలోకి సరకులు అనుమతించకుండా అడ్డుకుంటోందని, హమాస్ దాడి తర్వాత జీవనాధార అవసరాలను కూడా నిలిపివేయడంతో గాజావాసుల జీవనం దుర్భరంగా మారిందని నివేదిక వెల్లడించింది.హమాస్



నేతృత్వంలోని ఉగ్రవాదులు 2023 అక్టోబర్ 7న దక్షిణ ఇజ్రాయెల్‌పై దాడులు చేయడంతో గాజాలో యుద్ధం మొదలైంది. దాదాపు 1200 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. 251 మంది హమాస్ బందీలయ్యారు. ఖతార్ తదితర వర్గాల మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణ సమయంలో చాలా మంది బందీలు విడుదలయ్యారు. ఇజ్రాయెల్ ప్రతీకార దాడుల్లో 64,871 మంది పాలస్తీనియన్లు బలైపోయారు. మృతుల్లో సగానికి సగం మంది మహిళలు, చిన్నారులే అని వైద్యవర్గాలు చెబుతున్నాయి. ఒకవైపు మంగళవారం ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడైన తరుణంలోనే మరోవైపు గాజాలో ఇజ్రాయెల్ బలగాలు నేరుగా భూతల దాడులకు దిగడంతో వేలాది మంది ప్రాణభయంతో పాలస్తీనాను విడిచిపెట్టి పారిపోతున్నారు. గాజాలో తాజాగా జరిగిన దాడుల్లో 34 మంది మృతి చెందారు.గాజా సిటీలో దాదాపు మూడు వేల మంది హమాస్ ఉగ్రవాదులు ఉన్నారన్న అంచనాతో ప్రతి అంగుళం గాలిస్తున్నారు. ఇజ్రాయెల్ ఆపరేషన్‌కు ముందు గాజాలో దాదాపు 10 లక్షల మంది పాలస్తీనా వాసులు ఉండేవారు. ఇప్పటివరకు 3.5 లక్షల మంది నగరం విడిచి వెళ్లిపోయారని ఇజ్రాయెల్ సైన్యం చెబుతోంది. ఐక్యరాజ్యసమితి అంచనాల ప్రకారం గత నెలలో 2.20 లక్షల మందికి పైగా పాలస్తీనియన్లు ఉత్తర గాజా నుంచి తరలి వెళ్లినట్టు తేలింది. ఇదిలా ఉండగా ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 80 వ వార్షికోత్సవ వేడుకల రెండో విడత ఉన్నత స్థాయి సమావేశాలు ఈనెల 23 నుంచి న్యూయార్క్‌లో ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా యూరప్ దేశాలు పాలస్తీనాను ఒక సర్వ స్వతంత్ర, సార్వభౌమాధికార దేశంగా గుర్తించనుండటం పాలస్తీనా ప్రజల అస్తిత్వానికి రక్షణ కల్పించడమే.

## ప్రతిపక్ష హోదా కోసం పట్టుబట్టమేంటి

విజయవాడ,తెలుగు రాష్ట్రాల్లో మాజీ ముఖ్యమంత్రులు అసెంబ్లీకి రాకపోవడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయినప్పటి నుంచి ఇరు రాష్ట్రాల మాజీ సీఎంలు అసెంబ్లీకి ముఖం చూపించిన దాఖలాలే లేవని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యేలుగా గెలిచిన.. ప్రజా సమస్యల తరఫున వారు మాట్లాడక పోవడంతో.. నియోజకవర్గ ప్రజల్లో నుంచి అసంతృప్తి వ్యక్తం అవుతుంది. అయితే.. ఏపీలో మాజీ సీఎం జగన్ తనకు ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీలో అడుగు పెడతానంటూ.. భీష్మించుకుని కూర్చున్న సంగతి తెలిసిందే. రాజ్యాంగంలో ప్రతిపక్ష హోదాకు ఉన్న నియమ నిబంధనల ప్రకారం జగన్‌కు ప్రతిపక్ష హోదా ఇచ్చేది లేదని కూటమి ప్రభుత్వం ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేసింది. మరోవైపు తెలంగాణలో మాజీ సీఎం కేసీఆర్ తన అనారోగ్య సమస్యల వల్ల అసెంబ్లీ సమావేశాలకు రాలేకపోతున్నానని.. కాలం గడుపుతున్నారు. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల మాజీ సీఎంలపై సీపీఐ నేత నారాయణ కీలక వ్యాఖ్యలు చేశారు.

# సీబీఐకి ఫోన్ ట్యాపింగ్ కేసు..!

హైదరాబాద్,రేవంత్ రెడ్డి సర్కార్ మరో సంచలన నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని సీబీఐకి అప్పగించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇప్పటికే ఈ వ్యవహారంపై సిట్‌ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ విచారణలో భాగంగా సిట్ అధికారులు కీలక ఆధారాలను సేకరించారు. ఆ క్రమంలో పలువురిని సైతం విచారించారు. అందులో భాగంగా ముఖ్యమైన ఆధారాలను సేకరించిన సంగతి తెలిసిందే. మరోవైపు రూ.లక్షల కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ వ్యవహారాన్ని సైతం ఇప్పటికే సీబీఐకి రేవంత్ సర్కార్ అప్పగించిన విషయం విదితమే.2023 అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ఓటరు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాడు. దీంతో రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ కొలువు తీరింది. అయితే గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో విపక్ష పార్టీల్లోని కీలక నేతలపైనే కాకుండా.. స్వపక్షంలోని పలువురు నేతల ఫోన్లు సైతం ట్యాపింగ్ గురైనట్లు గుర్తించారు. దీంతో ఈ వ్యవహారంపై రేవంత్ సర్కార్ సిట్‌ను ఏర్పాటు చేసింది. సిట్ దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. అంతేకాకుండా.. పలువురు పోలీస్ ఉన్నతాధికారులు సైతం ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో అరెస్టయిన సంగతి తెలిసిందే. ఈ కేసును సైతం సీబీఐకి అప్పగించేందుకు రేవంత్ ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది.మరోవైపు లక్షల కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించింది. ఎన్నికలకు కొద్ది రోజుల ముందు మేడిగడ్డ బ్యారేజీలోని పిల్లర్లు కుంగాయి. దీంతో బీఆర్ఎస్ ప్రభుత్వంపై నాటి ప్రతిపక్ష పార్టీలు విమర్శలు గుప్పించాయి. దాంతో తాము అధికారంలోకి వస్తే ఈ వ్యవహారంపై విచారణ జరుపుతామని అప్పటి పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. ఆ క్రమంలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను గెలుచుకుంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. దాదాపు 13 నెలల విచారణ అనంతరం నివేదికను ప్రభుత్వానికి అప్పగించింది ఈ కమిషన్. ఈ కేసును సైతం సీబీఐకి అప్పగిస్తూ.. రేవంత్ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం విదితమే. అలాగే ఫోన్ ట్యాపింగ్ కేసును సైతం సీబీఐకి అప్పగించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది.

# వైకాపా హయాంలో భారీ లిక్కర్ స్కామ్

అమరావతి,వైకాపా ప్రభుత్వంలో భారీ మద్యం కుంభకోణం జరిగిందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. నాసిరకం మద్యం సరఫరా చేసి ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీశారన్నారు. ఇందులో వందలకోట్లు దుర్వినియోగం జరిగిందని అన్నారు. బెల్టుషాపులు, నకిలీ మద్యం అమ్మకాలపై శాసన మండలిలో చర్చ సందర్భంగా వైకాపా ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, శివరామిరెడ్డి అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. మద్యం విషయం లో అంతా మంచి జరిగిందని వైకాపా చెప్పడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. మద్యం కుంభకోణంపై సిట్ విచారణ జరుగుతోంది.. త్వరలో వాస్తవాలు బయటకు వస్తాయని మంత్రి అన్నారు. మద్యం దుకాణదారులు తప్పు చేస్తే జరిమానా, రెండోసారి తప్పు చేస్తే లైసెన్స్ సస్పెండ్ చేస్తున్నాం. సరఫరా పర్యవేక్షణకు పటిష్ఠ వ్యవస్థను ఏర్పాటు- చేసి అమలు చేస్తున్నాం. రాష్ట్రంలో లిక్కర్ పాలసీని చాలా పారదర్శకంగా అమలు చేస్తున్నాం. మనం అమలు చేసే పాలసీని పక్క రాష్ట్రాలు కూడా అధ్యయనం చేస్తున్నాయి. మద్యాన్ని ఆదాయ వనరుగా ప్రభుత్వం ఎప్పుడూ చూడలేదు. నాసిరకం మద్యం అమ్మినవా రిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటున్నాం. రాష్ట్రంలో లిక్కర్ వల్ల చనిపోయినట్లుగా ఎక్కడా కేసు నమోదు కాలేదని తెలిపారు.

# నిరుద్యోగులతో ఎందుకీ చెలగాటం?



న్యూఢిల్లీ,ఎన్నో దశాబ్దాలుగా ఈ ప్రాంత నిరుద్యోగుల ఆశలు అడియాశలు అయ్యాయి. చేసిన బలిదానాలకు అర్థం లేకుండాపోయింది. ప్రారంభించిన ఉద్యమాలు, ఆత్మార్పణలు అన్నీ వృథా ప్రయాసే అనే నిరాశలో, నిరుత్సాహంతో తెలంగాణ రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగులు ఒక రకమైన మానసిక సంఘర్షణ చేస్తున్నారు. హైదరాబాద్ రాష్ట్రంలో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నో దశాబ్దాలుగా ఉద్యోగాల కోసం ఈ ప్రాంత నిరుద్యోగులు తమకు జరుగుతున్న అన్యాయాలను ఎలుగెత్తి చాటారు. విసుగు చెంది ఇక స్వరాష్ట్రంలోనే తమ ఆకాంక్షలు నెరవేరుతాయని 1969 లో తొలి తెలంగాణ ఉద్యమం నడిపి విద్యార్థులు అమరులయ్యారు. ఆ తర్వాత కూడా ఈ ప్రాంత విద్యార్థి, నిరుద్యోగులకు నష్టం జరగడాన్ని తట్టుకోలేక మలిదశ తెలంగాణ ఉద్యమం లో 1200 మంది ఆత్మార్పణ చేసుకొని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆకాంక్షను దేశానికి అర్థం అయ్యేలా చేశారు.ఇది చరిత్ర.. కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు 2014 అయ్యాక కూడా నిరుద్యోగులు, విద్యార్థుల ఆకాంక్షలు ఆవిరై ఒకతరం భవిష్యత్ నాశనం అయింది. వేసిన ఉద్యోగ ప్రకటనలు అయితే కోర్టు మెట్లు ఎక్కడంతోనే మొదటి దఫా ప్రభుత్వం పనితనం అయింది. రెండో దఫా ప్రభుత్వం ఉద్యోగ ప్రకటనలు లీకేజీలతో గడిచింది. దీనితో విసుగు చెందిన నిరుద్యోగ, విద్యార్థి యువకులు మొన్న జరిగిన ఎన్నికలలో నూతన ప్రభుత్వం కోసం గత ప్రభుత్వాన్ని తిరస్కరించారు. ప్రస్తుత ప్రభుత్వం గతంలో జరిగిన పొరపాట్లు జరగకుండా మొదటగా టిఎస్‌పిఎస్‌సి బోర్డ్‌ను ప్రక్షాళన చేశారు. ఇంకా టిఎస్‌పిఎస్‌సిలో ఖాళీగా వున్న ఉద్యోగాలను మొదటగా భర్తీ చేసిన తర్వాతే ఉద్యోగ ప్రకటనలు జారీ చేయాలని అనుకున్నారు.వేసే ఉద్యోగ ప్రకటనలు కోర్టుమెట్లు ఎక్కకుండా జాగ్రత్త తీసుకోవాలి అని, ఉద్యోగ క్యాలెండర్ మేనిఫెస్టోలో చేర్చారు. నోటిఫికేషన్ వచ్చాక మాత్రం ఒక సంవత్సరంలో పూర్తి అయ్యేలా జవాబుదారీతనంతో, పారదర్శకతతో చేస్తేచాలని కోటి ఆశలతో వున్నారు. వివిధ ఉద్యోగ ప్రకటనలకు అర్హత వున్న అందరూ ఎగ్జామ్ రాసేలా సమయాన్ని ఇచ్చేలా ప్రణాళికతో నిర్వహించాలని తలచారు. కానీ జరిగింది, జరుగుతున్నది చూస్తుంటే నిరుద్యోగులకు అన్యాయం ఇప్పటికీ జరుగుతున్నదని తెలుస్తున్నది. ఎందుకంటే గ్రూప్ 2 ఎగ్జామ్‌ను పోస్టులు పెంచకుండా వాయిదా వేశారు. గ్రూప్ 3 పోస్టులను కూడా పెంచలేదు. గ్రూప్1 పరీక్షపై అనేక నీలినీడలు వున్నాయి. దాదాపు 20 రకాల కేసులు హైకోర్టులో పెండింగ్‌లో వున్నాయి.కానీ కోర్టులో అఫిడవిట్ వేయడం టిజిపిఎస్‌సికి రావట్లేదు. అసలు సమస్య జిఒ నెంబర్ 55ను తీసివేసి జిఒ నంబర్ 29 ను తీసుకొచ్చి రిజర్వేషన్ సూత్రానికి విరుద్ధంగా ప్రిలిమ్స్‌లో పాస్ అయిన అభ్యర్థులను మెయిన్స్‌కి ఎంపిక చేశారు. ప్రిలిమ్స్ పరీక్షలో క్వశ్చన్‌లకు జవాబులు తప్పుగా ఇచ్చారని అభ్యర్థులు కమిషన్ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా కూడా పట్టించుకోకుండా పబ్లిక్ సర్వీస్ కమిషన్ మూర?ంగా వ్యవహరించింది. ఇలా చేసే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎపిపిఎస్‌సి 2011లో ఇచ్చిన గ్రూప్ 1 రెండుసార్లు మెయిన్స్ ఎగ్జామ్స్ నిర్వహించాల్సి వచ్చింది. ఇప్పుడు కూడా మెయిన్స్ ఎగ్జామ్స్‌పై పలు కేసులు వేయడం వలన వాటిని విచారణ చేసిన హైకోర్టు నిన్న తీర్పును వెలువరిస్తూ మెయిన్స్ మూల్యాంకనం మళ్ళీ చేయాలని, అది సాధ్యం కాకపోతే మళ్ళీ మెయిన్స్‌ను నిర్వహించాలని తీర్పు ఇచ్చింది.గత ప్రభుత్వంలో రెండు సార్లు ప్రిలిమ్స్‌ను రద్దు చేశారు. ఇప్పుడు ప్రిలిమ్స్ నిర్వహించినా అనేక అపోహలు, అనుమానాలు, అపార్థాలు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకు తీరని మానసిక వేదన, ఆవేదనతో ఇబ్బందిపడ్డారు. కేసులో అన్నీ కోర్టు పరిధిలో పరిష్కరించాకే మెయిన్స్ ఎగ్జామ్ నిర్వహించాలని తమ బాధను, మూగ వేదనను ఎవరి చెప్పాలో తెలియక మానసిక క్షోభను అనుభవిస్తూ మెయిన్ ఎగ్జామ్స్ రాశారు. కానీ తుదకు ఈ రోజు సెలెక్ట్ అయిన అభ్యర్థులు, సెలెక్ట్ కాని అభ్యర్థులు ఇద్దరు సంతోషం పోగొట్టుకున్నారు. ప్రభుత్వం ఒక రకంగా యుద్ధప్రాతిపదికన గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లను పరీక్షలు నిర్వహించి, రిజల్ట్ ప్రకటించి అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చింది. కానీ గ్రూప్1 విషయం లో కూడా ఎగ్జామ్ నిర్వహించాలని అనుకుందే కానీ నిరుద్యోగుల అపోహలను గుర్తించలేకపోయింది.ప్రభుత్వ తప్పు ఇక్కడ లేకున్నా టిజిపిఎస్‌సి ఏం చేస్తున్నట్టు? ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఎందరు చైర్మన్‌లు మారినా ఈ అవకతవకలకు ముగింపు పలుకలేరా? వీరికి సరిగా ఎగ్జామ్స్ నిర్వహించడం రాకపోతే చాలా మంది నిరుద్యోగులు వున్నారు. వారి ద్వారా టిజిపిఎస్‌సి బోర్డు ఏర్పాటు చేస్తే వారే తోటి నిరుద్యోగులకు పారదర్శకంగా, జవాబుదారీగా, విజయవంతంగా నిర్వహించి చూపిస్తారు. గత ప్రభుత్వం లాగే ప్రతిదీ కోర్టు మెట్లు ఎక్కితే జాబ్ క్యాలెండర్ వేసి ఉద్యోగాలను ఎలా భర్తీ చేస్తారు? వీటన్నింటికీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ బాధ్యత వహించాలి. అనుమానాలు, అపోహలను తొలగించాల్సిన బాధ్యత రాజ్యాంగ సంస్థ అయిన పబ్లిక్ సర్వీస్‌కమిషన్‌పై వుంది. ప్రభుత్వం కూడా తగిన చొరవ తీసుకోవాలి. గత ప్రభుత్వ తప్పులను ఈ ప్రభుత్వం కూడా చేస్తే ఇక నిరుద్యోగుల ఆకాంక్షలు ఎవరు తీర్చాలి? ఇంకా ఎన్ని దశాబ్దాలు ఈ అన్యాయం చూస్తూ వుండాలి? తరతరాలుగా జరుగుతున్న అన్యాయాన్ని సరిచేయాల్సిన అవసరం వుంది.ఇప్పటికే ఒక తరానికి అన్యాయం జరిగింది. ఇంకో తరానికి అదే జరుగుతున్నది. నిరుద్యోగుల జీవితాలు గత 12 సంవత్సరాల్లో తలకిందులు అయ్యాయి. నిరుద్యోగులు గ్రామగ్రామాన తిరిగి ప్రజలలో చైతన్యం కలిగించి ఈ ప్రభుత్వ ఏర్పాటులో తగు కృషి చేసిన ఈ రాష్ట్ర నిరుద్యోగులకు కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వంలో కూడా తగిన న్యాయం ఇప్పటికీ జరగట్లేదు. ఇప్పటికి అయిన ప్రభుత్వం, మేధావులు మౌనం వీడి జరుగుతున్న పొరపాట్లను సరిచేయాల్సిన తక్షణావసరం వుంది. జాబ్ క్యాలెండర్ యుపిఎస్‌సి తరహాలో ప్రకటించి ప్రతి ఎగ్జామ్‌కి తగిన సమయం ఇవ్వాలి. అవసరం అయితే నిరుద్యోగులతో మీటింగ్ ఏర్పాటు చేసి వారి అభిప్రాయాలు ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలి. ఇవి అన్నీ జరిగేలా, నిరుద్యోగుల జీవితాలలో మార్పు వచ్చేలా చేస్తారని యావత్తు తెలంగాణ విద్యార్థి, నిరుద్యోగ యువకులు తెలియజేస్తున్నారు.

# ధరల పెంపుపై వివరణ ఇచ్చిన టీజీఎస్‌ఆర్టీసీ

హైదరాబాద్,పండుగల నేపథ్యంలో బస్సు టికెట్ చార్జీలను పెంచినట్లు జరుగుతున్న ప్రచారాన్ని టీజీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం ఖండించింది. టికెట్ చార్జీలు పెరిగాయనే ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని స్పష్టం చేసింది. ప్రధాన పండుగల సమయాల్లో నడిచే స్పెషల్ బస్సుల్లో మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 16 ప్రకారం తిరుగు ప్రయాణంలో ఖాళీగా వచ్చే సర్వీసులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చుల మేరకు టికెట్ ధరలను సంస్థ సవరిస్తుందని పేర్కొంది. స్పెషల్ బస్సుల్లో మాత్రమే సాధారణ చార్జీలో 50 శాతం వరకు సవరణ అమల్లో ఉంటుందని వివరించింది. టీజీఎస్‌ఆ ర్టీసీలో 2003 నుంచి ఈ పద్ధతి ఆనవాయితీగా వస్తోందని, ఇప్పుడే స్పెషల్ బస్సుల్లో కొత్తగా చార్జీలను సవరణ చేస్తున్నట్లు కొందరు దుష్ప్రచారం చేయడం మానుకోవాలని హితవు పలికింది.' ప్రధాన పండగలైన సంక్రాంతి, దసరా, రాఖీ పౌర్ణమి, వినాయక చవితి, ఉగాది, తదితర సమయాల్లో హైదరాబాద్ నుంచి ప్రయాణికులు ఎక్కువగా సొంతూళ్లకు వెళ్తుంటారు. ఈ సందర్భాల్లో ప్రజలకు రవాణా పరంగా ఇబ్బందులు తలెత్తకుండా వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు స్పెషల్ సర్వీసులను టీజీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం నడుపుతుంది. రద్దీ మేరకు హైదరాబాద్ సిటీ బస్సులను కూడా జిల్లాలకు తిప్పుతుంది. తిరుగు ప్రయాణంలో ప్రయాణికుల రద్దీ ఉండకపోవడంతో ఖాళీగా ఆ బస్సులు వెళుతుంటాయి. ఆ స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చుల మేరకు టికెట్ ధరను సవరించుకోవాలని 2003లో జీవో నంబర్ 16 ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. పండుగల సమయాల్లో నడిచే స్పెషల్ బస్సుల్లో మాత్రమే 50 శాతం వరకు టికెట్ ధరను సవరించుకునే వెసులుబాటును సంస్థకు ఇచ్చింది. ' అని టీజీఎస్‌ఆర్టీసీ తెలిపింది.టీజీఎస్‌ఆర్టీసీలో ప్రస్తుతం 10 వేల వరకు బస్సులు సేవలందిస్తున్నాయి. పండుగ సమయాల్లో రద్దీకి అనుగుణంగా ప్రతి రోజు సగటున 500 నుంచి 1000 వరకు స్పెషల్ బస్సులను మాత్రమే సంస్థ నడుపుతుంది. ఆ స్పెషల్ బస్సుల్లో మాత్రమే జీవో ప్రకారం చార్జీల సవరణ ఉంటుంది.మిగతా రెగ్యులర్ సర్వీసుల చార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదని టీజీఎస్‌ఆర్టీసీ స్పష్టం చేసింది.బతుకమ్మ, దసరా పండగల నేపథ్యంలో ఇప్పుడు కూడా స్పెషల్ బస్సులను సంస్థ నడుపుతోందని టీజీఎస్‌ఆర్టీసీ తెలిపింది. రద్దీ ఎక్కువగా ఉండే ఈ నెల 20తో పాటు 27 నుంచి 30 తేదీ వరకు వరకు, అలాగే అక్టోబర్ 1, 5, 6 వ తేదీల్లో నడిచే స్పెషల్ బస్సుల్లోనే చార్జీల సవరణను సంస్థ చేయనుందని పేర్కొంది. ఆయా రోజుల్లో తిరిగే రెగ్యూలర్ సర్వీసుల చార్జీల్లో ఎలాంటి మార్పు చేయలేదని స్పష్టం చేసింది. పండగల సమయాల్లో నడిచే అన్ని బస్సుల్లోనూ చార్జీలను సవరించారని కొందరు ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేస్తున్నారని.. ఈ ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని టీజీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం స్పష్టం చేస్తోంది.కాగా, టీజీఎస్‌ఆర్టీసీ బస్సుల్లో టికెట్ల ధరల పెంపుపై తెలంగాణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు పండుగల సమయాల్లో ప్రత్యేక సర్వీసులు నడిపించారని.. కానీ ఆయా బస్సుల్లో టికెట్ల ధరలను పెంచలేదని గుర్తుచేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే స్పెషల్ సర్వీసుల పేరుతో దోచుకుంటున్నారని మండిపడుతున్నారు.

